


# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 80 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 13 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కన్నుమూత



**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర మాజీ మంత్రి శివ రాజ్ పాటిల్ (90) అనారోగ్యంతో కన్నుమూశారు. మహారాష్ట్ర లాతూర్‌లోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడి చారు. శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నేత శివరాజ్ పాటిల్ మరణం తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన సంతాపం వ్యక్తం చేశారు. 'శివరాజ్ పాటిల్‌జీ మరణం విచారకరం. ఆయన అనుభవజ్ఞుడైన నాయకుడు. ప్రజా జీవితంలో సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రితో సహా అనేక హోదాల్లో సేవలందించారు. సమాజ సంక్షేమానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. కొన్ని నెలల క్రితమే ఆయన నా నివాసానికి వచ్చారు. ఇంతలోనే ఇలా జరగడం విచారకరం. ఓం శాంతి' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా శివరాజ్ పాటిల్ మరణానికి సంతాపం తెలిపారు. 1935లో జన్మించిన పాటిల్.. మున్సిపల్ కౌన్సిల్ చీఫ్‌గా తన రాజకీయ జీవితాన్ని ఆరంభించారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభలో 10వ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2004-2008 వరకు కేంద్ర హోంమంత్రిగా ఉన్నారు. పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం అడ్మినిస్ట్రేటర్‌గా కూడా సేవలందించారు.

## కర్ణాటకలో 'విందు' రాజకీయం..

### రాత్రివేళ ఎమ్మెల్యేలను కలిసిన డీకే



**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటక రాజకీయాలు కొన్ని నెల లుగా చర్చనీయాంశమవు తున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తు న్నాయి. ఇప్పుడు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భాజపా నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. ఇవన్నీ సాధారణ కార్యక్రమాలేనని నేతలు చెబుతున్నారు. "ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్నాం. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. అదొక స్నేహపూర్వక సమావేశం" అని డీకే అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్ని రోజులుగా ఊహాగానాలు వినిపిస్తోన్న తరుణంలో ఈ బల ప్రదర్శనలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




# విశాఖలో ఐటి ఎకో సిస్టం

- స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం
- టూరిజానికే కాదు.. టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ
- కాగ్నిజెంట్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



**విశాఖపట్నం, నేటి వార్త :** విశాఖలో ఐటీ ఎకో సిస్టం ఏర్పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల విశాఖ ఐటీ కేంద్రంగా అవతరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 25 వేల మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో క్యాంపస్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి 3 దశల్లో మిగతా .. 2లో..

రష్యా- ఉక్రెయిన్ పోరు ముదిరితే..

## మూడో ప్రపంచ యుద్ధమే : ట్రంప్



**నేటి వార్త :** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఉద్దేశిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజుల్లో యుద్ధంలో దాదాపు 25వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. 'రక్తపాతం ఆగిపోవాలని నేను కోరుకుంటున్నా. గత నెలలో 25వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో ఎక్కువమంది సైనికులే ఉన్నారు. బాంబుల వల్ల మరికొందరు మిగతా .. 2లో..

విశాఖలో కాగ్నిజెంట్ కార్యాలయాన్ని ప్రారంభించిన

## మంత్రి నారా లోకేశ్



**విశాఖపట్నం, నేటి వార్త :** విశాఖలో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. రుషికొండ ఐటీ పార్కులోని హిల్-2పై మహతి ఫిన్‌టెక్ భవనంలో దీన్ని ఏర్పాటుచేశారు. వెయ్యి సీటింగ్ కెపాసిటీతో మిగతా .. 2లో..

## పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సువర్ణవకాశం
పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు
స్పీడ్ ఆఫ్ బిజినెస్ కు ప్రభుత్వ హామీ - పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామం
రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోనే పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రం అనుకూలంగా ఉందని ఈ అవకాశాన్ని పెట్టుబడిదారులు అందిపుచ్చుకుని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పిలుపునిచ్చారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో మూడు రోజుపాటు నిర్వహించే ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో 2025ను శుక్రవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని అందుకు ప్రభుత్వం పెట్టుబడులు పెట్టేవారి కోసం సింగిల్ విండో ద్వారా 21 రోజుల లోపుగానే అనుమతులు ఇస్తుందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆయన ప్రతినిధిగా బిజినెస్ ఎక్స్ పో 2025 కు హాజరుకావడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వ్యవస్థ, విజనరీ లీడర్ షిప్ కారణంగా రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి మిగతా .. 2లో..

## ఈడబ్ల్యూఎస్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు

- 2014-19 మధ్యకాలం ఈడబ్ల్యూఎస్ కులాలకు స్వర్ణయుగం
- త్వరలో నూతన విధానంలో విదేశీ విద్యా పథకం పునరుద్ధరణ
- ఈడబ్ల్యూఎస్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత ఆత్మీయ సమావేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరహాలో అన్ని ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ లో కూడా క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజక వర్గంలోనూ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయంలో ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల ఆర్థిక వృద్ధికి ఆయా కార్పొరేషన్ల ఆధ్వర్యంలో చేపట్టాలని సంక్షేమ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా కుల సంఘాల ప్రతినిధులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కాపు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఇతర ఈబీసీ కులాల సాధికారితకు పలు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ కులాల అభ్యున్నతే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. వివిధ పథకాల అమలులో భాగంగా 2025-26 బడ్జెట్ లో ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం రూ.10,608.61 కోట్లు మిగతా .. 2లో..

## వెలిగొండతో వెలుగులు

ప్రాజెక్ట్ 2026 కల్లా పూర్తి చేస్తాం - పనుల రోజువారి లక్ష్యాలు పెంచాం
సమీక్ష సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా భూమి పూజ చేసుకున్న వెలిగొండ ప్రాజెక్ట్ పనులు 2026కి పూర్తి చేయాలని పట్టుదలతో పని చేస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టన్నెల్ లో 18 కి. మీ లోపలి వరకు ఆయన ప్రయాణించి, క్లిష్టమైన లైనింగ్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలసి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో ఇప్పుడు జరుగుతున్న పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ వరకు పూర్తి చేయడానికి మరో మూడు నుంచి నాలుగు వేల కోట్లు అవసరమవుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఇన్ని పనులు ఉండగా.. ఈ ప్రాజెక్టు పూర్తయిపోయిందని.. జగన్మోహన్ రెడ్డి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# విశాఖలో ఐటీ ఎకో సిస్టం

కాగ్నిజెంట్ టెక్నాలజీస్ క్యాంపస్ పూర్తి కానుంది. 2026 నాటికి మొదటి దశ నిర్మాణాన్ని కాగ్నిజెంట్ పూర్తి చేసుకోనుంది. అప్పటివరకు తాత్కాలిక కార్యాలయంలో కాగ్నిజెంట్ కార్యకాలపాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై కాగ్నిజెంట్ దృష్టి సారించింది. కాగ్నిజెంట్ క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఇన్ హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తోంది. చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, కలకత్తా, పూణేలో కాగ్నిజెంట్ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయి. ఇప్పుడు విశాఖకూ కాగ్నిజెంట్ అడుగుపెట్టింది. హ్యాపెనింగ్ సిటీ విశాఖకు రావాలని కాగ్నిజెంట్ ను ఆహ్వానించాం. త్వరలో 25 వేల మందితో పనిచేసే కేంద్రంగా కాగ్నిజెంట్ త్వరలోనే తయారు కావాలి. 34 బిలియన్ డాలర్ల పెట్టుబడితో కాగ్నిజెంట్ కార్యకలాపాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కాగ్నిజెంట్ లో 85 శాతం మంది భారతీయులే. ఆ సంస్థ సీఈఓ కూడా భారతీయుడే కావటం విశేషం. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్ లో లక్ష మంది ఉద్యోగులతో పని చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఫాస్టెస్ట్ గ్రోయింగ్ కంపెనీగా కాగ్నిజెంట్ ఎదుగుతోంది. గతంలో హైదరాబాద్ లో నాటి టీడీపీ ప్రభుత్వం రూపోందించిన ఎకో సిస్టంతో ఐటీ నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు. 3 దశాబ్దాల క్రితం చేసిన విజన్ తోనే దిగ్గజ ఐటీ కంపెనీలకు భారతీయులు నాయకత్వం ఇస్తున్నారు. 1995లో వచ్చిన ఇంటర్నెట్ రివల్యూషన్ తో పాటు ఐటీ ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకున్నాం. అందుకే ఐటీకి బ్యాక్ బోన్ గా భారతీయులు నిలిచే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఏఐ విషయంలో కూడా ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ తీసుకోవాలని భావిస్తున్నాం. ఆ దిశగానే ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్ గా నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా తయారవుతోంది."అని సీఎం వెల్లడించారు.

**బెస్ట్ కనెక్టివిటీ... మోస్ట్ లివబుల్**

"విశాఖ నగరానికి బెస్ట్ కనెక్టివిటీ ఉండడంతోపాటు... మోస్ట్ లివబుల్ సిటీగా ఉంది. భోగాపురం విమానాశ్రయం, మెట్రో లాంటి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు వస్తాయి. ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటుంది. నౌకాదళ కేంద్రం నుంచి టూరిజం కేంద్రంగా, ఇప్పుడు టెక్ సిటీగా విశాఖ ఎదిగింది.కాగ్నిజెంట్ తోపాటు 8 సంస్థలకు ఇవాళ భూమి పూజ చేశాం. గూగుల్ కూడా త్వరలోనే డేటా సెంటర్ ను ఏర్పాటు చేయబోతోంది. ఇప్పటికే విశాఖలో 150 టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో నైపుణ్యం సాధించిన యువత ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడ్డారు. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 20 శాతం జీవన వ్యయం కూడా తక్కువ. ప్రపంచంలోనే బెస్ట్ అండ్ మోస్ట్ లివబుల్ సిటిగా విశాఖను తీర్చిదిద్దుతాం. దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరం కూడా విశాఖే. 2032కి 135 బిలియన్ డాలర్ల ఆర్ధిక వ్యవస్థగా విశాఖ ఎకనామిక్ రీజియన్ తయారవుతుంది. ఎకరా భూమి 99 పైసలకే ఐటీ కంపెనీలకు ఇవ్వటం ఓ గేమ్ ఛేంజర్. గుజరాత్ లో టాటా నానో కారు తయారీ కేంద్రానికి కూడా 99 పైసలకే ఎకరా చొప్పున భూమి ఇచ్చారు. ఇటీవలే భాగస్వామ్య సదస్సులో 613 ఎంఓయూల ద్వారా రూ. 13.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అలాగే ఎస్ఐపీబీల ద్వారా మరో రూ .8.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆమోదించాం. నేషనల్ క్వాంటం మిషన్ ను అందిపుచ్చుకుని ఏపీలోని అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు కాబోతోంది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను భారతదేశంలో పెట్టుకుంటున్నారు. భారత్ దేశం వైపు ప్రస్తుతం ప్రపంచం మొత్తం చూస్తోంది. ఈ క్రమంలో ఏపీని, విశాఖను మరింతగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు విశాఖకు వస్తున్నాయి. కాగ్నిజెంట్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూడా విశాఖలో పెట్టాలని కోరుతున్నాను. రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్ జోన్లు ప్రపంచస్థాయి ఉత్పత్తులు తయారు చేస్తున్నాయి. పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ఎస్క్రో ఖాతాను పెడుతున్నాం. ఈ తరహాలో ఆలోచించే ప్రభుత్వాలు ఉండవు. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ లకు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను కూడా రూపోందిస్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది.

**8 వేలు కాదు... 25 వేలు**

కాగ్నిజెంట్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. విశాఖ కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. 8 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వంతో కాగ్నిజెంట్ సంస్థ ఒప్పందం చేసుకుంది. అయితే శంకుస్థాపన కార్యక్రమానికి ముందుగా రవికుమార్ తో సీఎం చంద్రబాబు కొద్దిసేపు సంభాషించారు. 8 వేల ఉద్యోగాలు కాదని... విశాఖ క్యాంపస్ లో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు శంకుస్థాపన కార్యక్రమం వేదికగా చంద్రబాబు సమక్షంలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని రవికుమార్ ప్రకటించారు. విశాఖకు రావడం తన సొంతింటికి వచ్చినట్టుందని రవికుమార్ అన్నారు.

**మరో 8 సంస్థలకు శంకుస్థాపనలు**

కాగ్నిజెంట్ సంస్థతో పాటు త్వరలోనే విశాఖ నుంచి మరికొన్ని సంస్థలు కూడా కార్యాకలాపాలు మొదలు పెట్టనున్నాయి. వీటిల్లో కొన్నింటికి శుక్రవారం నాడే శంకుస్థాపనలు జరిగాయి. టెక్ తమ్మిన, సత్వ డెవలపర్స్, ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ ఇండియా, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీస్, క్వార్బ్జ టెక్నోసాఫ్ట్, ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్సీఎం సర్వీసెస్, నాన్రెల్ టెక్నాలజీస్ వంటి సంస్థలకు శంకుస్థాపనలు జరిగాయి. త్వరలో విశాఖలో తమ కార్యకలాపాలు చేపట్టనున్నట్టు ఆయా సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సంస్థల ద్వారా రాష్ట్రానికి రూ. 3,740 కోట్ల పెట్టుబడులు, దాదాపు 41,700 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ప్రస్తుతం విశాఖలో 150కి పైగా టెక్ కంపెనీల కార్యకలాపాలు సాగిస్తుండడంతో రాష్ట్రంలో ఐటీ నిపుణులకు విస్తృతంగా అవకాశాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో ఒక్క విశాఖలోనే రూ.1.34 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయి. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్, డీబీవీ స్వామి, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు ఘంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్, ఐటీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రష్యా- ఉక్రెయిన్ పోరు ముదిరితే..

# మూడో ప్రపంచ యుద్ధమే : ట్రంప్

చనిపోయారు. ఇది వెంటనే ఆగిపోవాలి. అందుకు మేము చాలా కష్టపడి పనిచేస్తున్నాం. ఇలాంటి పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. ఇది చాలా ప్రమాదకరం. అందరూ ఆటలు ఆడుతున్నారని నేను అంతకుముందే చెప్పాను. అలా జరగాలని కోరుకోవడం లేదు' అని అన్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తమ ప్రభుత్వంలో ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఇక, నాలుగేళ్లుగా రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో పురోగతి లేకపోవడంపై ట్రంప్ అసహనంతో ఉన్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అన్నారు. ట్రంప్ ఆయా దేశాల అధికారుల నుంచి మాటలు కాకుండా.. ఫలితాలు కోరుకుంటున్నారన్నారు. చర్చలతో విసిగిపోయిన అధ్యక్షుడు చర్యలకు సిద్ధమైనట్లుగా తెలిపారు. ఈ శాంతి ప్రణాళికను ముందుకుతీసుకెళ్లడంలో ట్రంప్ పరిపాలనా సిబ్బంది చురుకుగా ఉన్నారన్నారు. యూరోపియన్ నేతలతో చర్చించేందుకు అధ్యక్షుడు సిద్ధమైనట్లు వెల్లడించారు. పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్ బృందం రష్యా- ఉక్రెయిన్‌లతో చర్చలు కొనసాగిస్తున్నారన్నారు. ఇక, ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేందుకు ట్రంప్ 28 సూత్రాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదనపై అసంతృప్తిగా ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ 20 పాయింట్లతో కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దీన్ని అగ్రరాజ్యం అమెరికాకు ఇప్పటికే అందించినట్లు తెలిపారు. డాన్‌బాస్ ప్రాంతాన్ని రష్యాకు అప్పగించేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ పునర్నిర్మాణం, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన విస్తృత ప్రణాళికపై అమెరికాతో చర్చిస్తామన్నారు.

విశాఖలో కాగ్నిజెంట్ కార్యాలయాన్ని ప్రారంభించిన

# మంత్రి నారా లోకేశ్

దీన్ని తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు కాసేపట్లో శంకుస్థాపన చేయనున్నారు. 'కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాలను సంస్థకు కేటాయించాం. అందులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఐటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఐటీ క్యాంపస్‌ను సంస్థ మూడు దశల్లో రూ.1,583 కోట్లతో నిర్మించనుంది. తద్వారా 8,000 మందికి ఉపాధి లభిస్తుంది. 2029 నాటికి మొదటిదశ పూర్తి చేయడం ద్వారా 3,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి మూడు దశలను సంస్థ పూర్తి చేస్తుంది' అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్

ప్రభుత్వం ఇప్పుడు స్పీడ్ ఆఫ్ బిజినెస్ నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. పరిశ్రమలు స్థాపనకు పెట్టుబడిదారులు ఆలోచన చేయగానే వారి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా వారికి మార్గనిర్దేశానికి సింగిల్ విండో విధానంతో ప్రభుత్వం చురుగ్గా అనుమతులు ఇస్తుందన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూరగొనటం ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు.

**దేశంలోనే మొట్టమొదటి క్వాంటం దిశగా అడుగు..**

క్వాంటం సాంకేతికతలో రాష్ట్రం విప్లవాత్మకమైన ముందగుడు వేసిందని, ముఖ్యంగా దేశంలోనే మొట్టమొదటగా క్వాంటం కంప్యూటర్‌ను స్థాపించబోయే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గర్వంగా ఉందన్నారు. దీనికి సంబంధించిన సన్నాహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. క్వాంటం అభివృద్ధికి కేంద్రం కేటాయించిన రూ. లక్ష కోట్ల నిధిని ఉపయోగించుకుంటున్న మొట్టమొదటి రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్ అని మంత్రి అన్నారు. కేవలం క్వాంటం కంప్యూటర్‌ను దిగుమతి చేసుకోవడమే కాకుండా క్వాంటం కంప్యూటర్ ను రాష్ట్రంలోనే తయారు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పెట్టుబడులకు భద్రత కల్పించటంలో భాగంగా ఎస్క్రో ఖాతా ద్వారా పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలను సకాలంలో అందించడానికి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం తీసుకోని విధంగా, పరిశ్రమలకు ఎస్క్రో అకౌంట్‌ను తెరవడం జరిగిందన్నారు. దీని ద్వారా గతంలో మాదిరిగా ప్రోత్సాహకాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడే పరిస్థితి ఉండదని, నిర్ణీత సమయంలోనే ప్రోత్సాహకాలు అందుతాయని అని అన్నారు.

**సమగ్ర పారిశ్రామిక విధానాలు..**

రాష్ట్రంలో సమగ్ర పారిశ్రామిక విధానాలు అందుబాటులో ఉన్నాయని 972 కిలోమీటర్ల తీర ప్రాంతం, సహజసిద్ద సారవంతమైన భూములు, మానవ వనరులతో పాటు 25 కు పైగా సమగ్ర విధానాలను తీసుకొచ్చిందన్నారు. వీటిలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, ఐటీ, క్వాంటం, మౌలిక సదుపాయాల రంగాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ పెట్టుబడిదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్డీఏ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులు, సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటక రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయా రంగాల్లో ఇతోధికంగా పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామిక అభివృద్ధితో పాటు కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి విస్తరణ, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్ విధానాల గురించి తెలిపారు. చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రీజినల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రవేశపెట్టిన రీసైక్లింగ్ పాలసీ పరిశ్రమల వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు కీలకమై, ప్లాస్టిక్, మెటల్, సీ&డీ రీసైక్లింగ్ యూనిట్లకు 45% వరకు క్యాపిటల్ ఇన్సెంటివ్‌తో పాటు పలు రాయితీలను ప్రభుత్వం అందిస్తున్నట్లు పి. కృష్ణయ్య తెలియజేశారు. ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర రావు మాట్లాడుతూ పెట్టుబడిదారులు ఆర్థికంగా బలోపేతమై రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఎంఎస్ఎంఈ అంటే లోకల్ కాదని, ఇది గ్లోబల్ కు సంబంధించిందిగా అభివర్ణించారు. ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో-2025 లో 150 కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. బ్యాంకింగ్, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, పర్యాటక, హ్యాండ్ ల్యూమ్స్, నిర్మాణ రంగానికి సంబంధించిన స్టాల్స్ తో పాటు వివిధ రంగాలకు చెందిన స్టాల్స్ ను మంత్రి కొలుసు పార్థసారధి పరిశీలించి స్టాల్ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్. గడ్డం శేఖర్ బాబు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో ఎం.విశ్వ, ఏపీ స్టార్ హోటల్స్ అధ్యక్షులు ఆర్.వీరా స్వామి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పి.భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ బి. రాజశేఖర్, కార్యదర్శి టిహెచ్. సుబ్బారావు, కోశాధికారి ఎస్.అక్కయ్య నాయుడు, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యూఎస్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు

కేటాయించిందన్నారు. వాటిలో ఈబీసీలకు రూ. 915.28 కోట్లు, కమ్మ కార్పొరేషన్ కు రూ.1,711.42 కోట్లు, రెడ్డి కార్పొరేషన్ కు రూ.1,946.36 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్ కు రూ.260.20 కోట్లు, కాపు కార్పొరేషన్ కు రూ.4,884.83 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కు రూ.545.05 కోట్లు. బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ.345.46 కోట్లు కేటాయించామన్నారు.

**కాపుల అభ్యున్నతికి పెద్దపీట**

కాపుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. 2014-19లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.172 కోట్లతో మంజూరు చేసిన 13 జిల్లా స్థాయి కాపు భవనాలను, 487 మినీ కాపు భవనాలు/కాపు కమ్యూనిటీ హాళ్లను గాలి కొదిలేసిందన్నారు. తొమ్మి జిల్లా స్థాయి కాపు భవనాలను మరియు 421 మినీ కాపు భవనాలు/కాపు కమ్యూనిటీ హాళ్లను రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నం, నెల్లూరు జిల్లా స్థాయి కాపు భవనాలను, అయిదు కాపు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను పూర్తి చేసిందన్నారు. 50 శాతం పనులతో అసంపూర్తిగా నిలిచిపోయిన తిరుపతి, కర్నూలు జిల్లా స్థాయి కాపు భవనాలను, 70 శాతం పూర్తయిన 39 కాపు మినీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాపులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**త్వరలో విదేశీ విద్యా పథకం పునరుద్ధరణ**

విదేశాల్లో చదువుకోవాలనే ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల కల నెరవేరుస్తూ, విదేశీ విద్యా పథకానికి త్వరలో శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా 2014-19 మధ్య అయిదేళ్లలో 2,234 విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసించారన్నారు. ఇందుకోసం అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.244 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ విదేశీ విద్యా పథకాన్ని నీరుగార్చారన్నారు. నిబంధనల పేరుతో కేవలం 60 మంది విద్యార్థులకు మాత్రమే విదేశీ విద్య చదువుకునే అవకాశం కల్పించారన్నారు. నూతన విధానంలో విదేశీ విద్యా పథకానికి పునరుద్ధరించడానికి సీఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు.

**కో అపరేటివ్ క్రెడిట్ సొసైటీల ఏర్పాటు**

బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాదిరిగా అన్ని ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ లో కూడా క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 2014-19 మధ్య ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల కోసం అమలు చేసిన అన్నిపథకాలను తిరిగి పున:ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్యవైశ్యుల కోరిన విధంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహించామన్నారు. వైశ్యుల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ.. కన్యకాపరమేశ్వరి మాతా జన్మస్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండను వాసవీ మాత పేరు మీద జీవో జారీచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోమటి, గుప్తా, శెట్టి వంటి పేర్లకు బదులు అందరినీ ఆర్యవైశ్యులుగా సంభోదించేలా త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల చైర్మన్లు కొత్తపల్లి సుబ్బారాయుడు, దూండీ రాకేశ్, బ్రహ్మయ్య చౌదరి, బుచ్చి రాంప్రసాద్, సూర్యనారాయణ రాజు, డైరెక్టర్లు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండతో వెలుగులు

జాతికి అంకితం చేయడం ఎంత విడ్డూరమో ఆలోచించాలన్నారు. రాష్ట్ర చరిత్రలో దగా కి మోసానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్ గా మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు లో జగన్ చేసిన తప్పిదాలు మోసం, దగా, జిల్లా రైతులకు తెలియాలనే రైతులతో కలసి సమీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెడ్ రెగ్యులేటర్లో 2200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు. 18నెలల కాలంలోనే టన్నెల్స్ లో క్లిష్టమైన 3 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 4 గ్యాంట్రీలతో రోజుకు 12 మీటర్ల లైనింగ్ పనులు చేస్తుండగా, గ్యాంట్రీల సంఖ్యను పెంచి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామని ఆయన అన్నారు. ఫీడర్ కెనాల్ లో 45వేల క్యూబిక్ మీటర్ల హార్డ్ రాక్ పనులు చేయాల్సి ఉండగా ఇప్పటికే 28వేల క్యూబిక్ మీటర్లు పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం 456 కోట్లతో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డిసెంబర్ లోనే పనులు మొదలుపెట్టి, సీజన్ వచ్చేలోపు పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించామన్నారు. తీగలేరు కెనాల్‌కు సంబందించి 600మీటర్ల టన్నెల్ లైనింగ్ చేసి, గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నల్లమల సాగర్ ముంపుతో 9.6 కి.మీ పర్మినెంట్ డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టామన్నారు. మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ఫీడర్ కెనాల్ గండ్లు పూడ్చి, జంట సొరంగాల్లో డీవాటరింగ్ పనులను పూర్తి చేసి, లైనింగ్ పనులు కొత్త లక్ష్యాలు నిర్దేశించి వేగంగా చూస్తున్నామన్నారు. కూటమి హయాంలో పనుల పురోగతి ఇలా ఉండగా వెలిగొండ ప్రాజెక్టుకు ఉత్తుత్తి ప్రారంభం చేసి, జాతికి అంకితం చేసిన జగన్ చరిత్రహీనుడుగా మిగిలిపోయాడన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారని ఆయన సోదాహరణంగా చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించి, పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు అనుక్షణం మమ్మల్ని ప్రోత్సహిస్తూ పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ముందు నిర్ణయించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు.2026 నాటికి వెలిగొండ పూర్తి చేసి నల్లమలసాగర్ ను కృష్ణాజలాలతో నింపుతామని ఆయన స్పష్టం చేశారు.

కోటి సంతకాల ముగింపు ర్యాలీలో

# తమ మద్దతు తెలిపిన ముస్లిం మైనార్టీలు



మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండపేట నియోజకవర్గం వ్యాప్తంగా రాష్ట్ర సభార్డినేట్ కమిటి చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన కోటి సంతకాల కార్యక్రమం పూర్తి చేసుకుని ప్రత్యేక వాహనం లో జిల్లా కేంద్రం అమలాపురానికి తరలించే కార్యక్రమనికి సంఘీభావం తెలిపిన ముస్లిం మైనార్టీలు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముస్లింల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి అని, ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన రిజర్వేషన్ బీసీ ఈ ద్వారా ఎందరో ముస్లిం విద్యార్థులు విద్యాభ్యాసాలు చేసి ఉన్నత శీఖరాలకి చేరారు అని నేడు వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ రూపంలో ఎందరో పేద విద్యార్థులకు వైద్య విద్య అభ్యసన చేయడానికి అవకాశం కల్పించారని కానీ ఆ ఆశయానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ వైద్య కళాశాలలను ప్రైవేటికరణ చేయడం పట్ల ఎందరో పేద విద్యార్థులు వైద్యవిద్య చదవాలనే ఆకాంక్ష పై నీళ్ళు చల్లారని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ముస్లింలు సైతం స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ వైద్య కళాశాలలకు మద్దతుగా సంతకాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బాని, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, వైసిపి పట్టణ ప్రెసిడెంట్ షేక్ గౌస్ మొహిద్దీన్, నియోజకవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ వల్లి సాహెబ్, సహస్తే హుస్సేన్, షేక్ ఇమామ్ సాహెబ్, ఎండీ. సర్కార్, ఎండీ. అలీషా, హెచ్ఎంటి అల్తాఫ్, షేక్ రహమాన్, షేక్ రోహిత్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీ పారదర్శకంగా ఉండాలి

పల్నాడు జిల్లాలో ఎల్పీజీ, ఎఫ్‌పీ డీలర్లతో సివిల్ సప్లై అధికారి కీలక సమావేశాలు



నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎస్ కాల్ సర్వే ద్వారా పౌరుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంరంగా పల్నాడు జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.వి. ప్రసాద్ గురువారం ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సర్వేలో గ్యాస్ డెలివరీ వ్యవస్థ, డెలివరీ బాయ్స్ ప్రవర్తన, దీపం-2 కార్యక్రమం అమలు వంటి అంశాలపై కార్డుదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సానుకూల అభిప్రాయాలను డీలర్ల ముందుంచారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "పాజిటివ్ పర్సెప్షన్" కోసం డెలివరీ బాయ్స్‌కు కఠిన ఆదేశాలు జారీ చేయాలని డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించారు. "వినియోగదారులకు సకాలంలో గ్యాస్ అందించడం, మర్యాదపూర్వక ప్రవర్తన, రసీదు కంటే అధికంగా డబ్బులు వసూలు చేయకూడదని, బుకింగ్ నుంచి డెలివరీ వరకు పారదర్శకత పాటించడం తప్పనిసరి" అని అధికారి స్పష్టం చేశారు. అదే రోజు జిల్లాలోని ఫెయిర్ ప్రైస్ (ఎఫ్‌పీ) షాపు డీలర్లతోనూ సమావేశాలు నిర్వహించారు. ముఖ్యంగా దాచేపల్లి, రొంపిచర్ల మండల కేంద్రాల్లో ఎఫ్‌పీ డీలర్లకు ప్రత్యేక మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఐవీఆర్ఎస్ సర్వేలో పర్ఫార్మెన్స్ బాగాలేని డీలర్లను గుర్తించి, వారి పని తీరును తక్షణం సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. ప్రతినెలా నాణ్యమైన రేషన్ సరుకులు విధిగా ఇవ్వాలని, లేనిపక్షంలో తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఐవీఆర్ఎస్ ద్వారా కార్డుదారుల అభిప్రాయాన్ని సేకరిస్తోంది. ఈ డేటాను జిల్లా స్థాయి అధికారులకు పంపి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీని భాగంగానే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాం. పనితీరు మెరుగుపడని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.వి. ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త పర్యవేక్షణ విధానం వల్ల ఎల్పీజీ, రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# కాకినాడలో 18 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

త్వరలో ప్రారంభం స్త్ర ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : నగర ట్రాఫిక్ నియంత్రణను బలోపేతం చేసేందుకు కాకినాడ నగరంలోని 18 ప్రముఖ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు గుర్తించడం జరిగిందని త్వరలోనే వీటిని ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ వెల్లడించారు. శుక్రవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ తాడిపల్లిలో నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్టీజీఎస్ అమలు, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, ఆటోలను క్రమబద్ధీకరించడం, శునకాల నియంత్రణపై సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అన్నకాంటీన్ల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష జరిగింది.ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ,సిడిఎంఏ ఆదేశాల మేరకు ఆర్టీజీఎస్ వ్యవస్థలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టామని, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ప్రతిష్టాపన బాధ్యతలను రెండు ఏజెన్సీలకు అప్పగించామనిసిగ్నల్స్‌ను త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని తెలిపారు.అలాగే పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలపై యుఎల్బిలు మరింత చురుకైన చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు నగరంలో శునకాల కోసం ప్రత్యేక షెల్టర్ల ఏర్పాటుకు కూడా నగరపాలక సంస్థ సిద్ధమవుతోందని వెల్లడించారు. పేదలకు మేలుచేసే అన్నకాంటీన్ల ద్వారా మెరుగైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక సలహా కమిటీ ఏర్పాటులో చర్యలు జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్.ఇ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఇఇ కనకరావు, సూపరింటెండెంట్ రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 13 డిసెంబర్ 2025




www.viswamvoice.com



# అల్లూరి జిల్లాలో ఘోర ప్రమాదం

## లోయలో పడిన ప్రైవేటు బస్సు.. 9 మంది మృతి








**చింతూరు, నేటి వార్త :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడింది. శుక్రవారం తెల్లవారుజామున చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో రాజుగారిమెట్ట వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 35 మంది యాత్రికులు ఉన్నారు. వీరిలో 9 మంది మృతిచెందారు. మరికొందరికి గాయాలయ్యాయి. మృతులను ఎస్వీ నాగేశ్వరరావు, శైలజారాణి, శ్యామల, సునంద, శివశంకర్, మధు, శ్రీకళ, ఉమారెడ్డి, కృష్ణకుమారిగా గుర్తించారు. ఘటనాస్థలికి చింతూరు పోలీసులు చేరుకున్నారు. అన్నవరం నుంచి భద్రాచలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సులోని ప్రయాణికులను చిత్తూరు జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. ఘటనాస్థలంలో 3 అంబులెన్స్‌లు, 5 పోలీసు వాహనాలతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియాను ప్రధాని మోదీ ప్రకటించారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు లోయలో పడి యాత్రికులు మృతి చెందడం బాధాకరమన్నారు. గాయపడినవారిని చింతూరు ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి లోకేశ్**

రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బస్సు లోయలో పడి యాత్రికులు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : హోంమంత్రి అనిత**

రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసుల నుంచి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

**బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ఏపీ ప్రభుత్వం**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో 9 మంది మృతి చెందగా, పలువురికి గాయాలైన విషయం తెలిసిందే. చింతూరు-మారేడుమల్లి ఘాట్‌రోడ్డు ప్రమాద స్థలిని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఇతర అధికారులు ఉన్నారు.

## బస్సు ప్రమాద మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**గాయపడిన ప్రయాణికులను మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రికి తరలించాలి**

**చింతూరు మారేడుమిల్లి ఘాటి పై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి**





**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చింతూరు మారేడుమిల్లి ఘాటిపై జరిగిన బస్సు ప్రమాదం బాధాకరమని, ప్రభుత్వం తక్షణమే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి కాకినాడ హాస్పిటల్స్ కి తరలించాలని, ఘాటిపై అనేక ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వాలు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవడం లేదని, తక్షణమే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ రంపచోడవరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. తెల్లవారుజామున మారేడుమిల్లి చింతూరు మధ్యనున్న గాటి పై జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లపు వెంకట్ పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడం జరిగింది. అనంతరం సిపిఎం నాయకత్వం మాట్లాడుతూ ఘాటీ లో ఉన్న మలుపుల యొక్క తీవ్రతను బస్సు డ్రైవర్ గుర్తించకపోవడం వలన ఈ సంఘటన జరిగిందని అన్నారు. ఈ ఒక్క ప్రమాదమే కాదని ఘాటి రూట్లో అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రభుత్వాలు ఆ సమయంలో హడావుడి చేసి ఆ తీవ్రతను గుర్తించే దాంట్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అందుకే ఈ ప్రమాదాలు మరల మరల పునారవృతం అవుతున్నాయని ఆరోపించారు. గాటి రూట్ లో జరుగుతున్న ప్రమాదాల దృష్టిలో పెట్టుకొని ఆ రహదారిని జాతీయ రహదారిలా వెడల్పు చేయడంతో పాటు రాత్రిపూట కనపడేటట్లు రేడియం లైటింగ్స్ ఏర్పాటు చేయాలని, మలుపులని డ్రైవర్లు గుర్తించే విధంగా రహదారి మధ్యలో రహదారికి ఇరువైపులా వైట్ బోర్డర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. బాధితులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద స్థలాన్ని హుటాహుటీనా సందర్శించిన ఎమ్మెల్యే శిరీష

**చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో బస్సు ప్రమాదంపై ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీషదేవి దిగ్భ్రాంతి**





**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాచలం నుంచి అన్నవరం వెళుతున్న యాత్రికుల ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడం చాలా దుర దుష్టకరం అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చింతూరు మండలం తులసిపాక సమీపంలో రాజుగారి మెట్ట వద్ద శుక్రవారం జరిగిన ఘోరరోడ్డు ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బస్సు ప్రమాదం, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో మాట్లాడి సత్వర సహాయ చర్యలు వేగవంతం చేయాలన్నారు.మృతదేహాలకు పోస్టుమార్టం వెంటనే నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు త్వరగా అందించాలని సూచించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా సహాయ కార్యక్రమాల్లో వారి స్వంత అంబులెన్సు సేవలందించి మానవత్వాన్నిచాటుకున్నారు. అలాగే బాధితులను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఇప్పటికే సంఘటన పై ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో పెట్టినట్లు తెలిపారు. బస్సులో మొత్తం 37 మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా అందులో 5గురు మహిళలు, 4గురు పురుషులు మొత్తం 9 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, చింతూరు మండల పార్టీ అధ్యక్షులు జమాల్ ఖాన్, మోతుగూడెం ఎంపీటీసీ వేగు నాగేశ్వరరావు, మారేడుమిల్లి మండలపార్టీ అధ్యక్షులు గురుకు శేషుకుమార్, మారేడుమిల్లి జనసేన మండలపార్టీ అధ్యక్షులు మళ్ళ దుర్గా ప్రసాద్, మారేడుమిల్లి తెదేపా మండలపార్టీ ఉపాధ్యక్షులు దూడ సువర్ణ కర్ణ కుమార్, మాజీ మండలపార్టీ అధ్యక్షులు అప్పాజీ, జహంగీర్, కర్రి సన్యాసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరం కారు ఓనర్స్ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నికలు

**కమిటీని అభినందనలు తెలిపిన జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కారు ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఒకే యూనియన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం శుభ పరిణామమని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జె.ఎన్.రోడ్డులోని రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన రాజమహేంద్రవరం కారు ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సమావేశానికి ఆర్టీవో ఆర్ సురేష్, స్థానిక అసోసియేషన్ నాయకులు గెద్దం రమణ, పి.నాగేశ్వర రావు, ఎస్ఆర్కేటీఆర్ మల్లిబాబులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అన్ని కారు ఓనర్స్ అసోసియేషన్‌లు కలిసి ఒకే యూనియన్‌గా ఏర్పడి నూతనంగా ప్రమాణ స్వీకారం చేయడం మంచి సూచిక అని తెలిపారు. మీ సమస్యల పరిష్కార దిశగా నాయకులపై నమ్మకం, భరోసా కలిగి ఉండాలని, తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో 9 సంవత్సరాలు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం ఉద్యోగుల నమ్మకం ఫలితమని గుర్తుచేశారు.రవాణా శాఖను తమ కుటుంబంగానే భావించాలని సభ్యులకు సూచించారు. తరువాత ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ: అధ్యక్షులు మహాలక్ష్మి గుమ్మళ్ల, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మట్టపర్తి, కార్యదర్శి వీరభద్రరావు మాధవరపు,సంయుక్త కార్యదర్శి ఆంజనేయులు మేక,ఖజాంచి శ్రీనివాసు మేరెటి,సభ్యులు రమేష్ గొంప,షరీఫ్ జోహెబ్, గణపతి చిలకసాని, సత్య వరప్రసాద పాదళ వీరు ఎన్నికయ్యారు.

## జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలి

**వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి - జనవరిలో ఛలో విజయవాడ కార్యక్రమం**

**విజయవాడలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించా లని,జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు తదితర సమస్యలపై జనవరి నెలాఖరులో ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. విజయవాడలో డిసెంబర్ 10వ తేదీ జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన సమావేశం ఫెడరేషన్ మహాసభను విశాఖపట్నంలో ఫిబ్రవరి నెలలోగా నిర్వహించాలని నిర్ణయించింది.ఈ మహాసభకు సీఎం నీ ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని, అన్ని రాజకీయ పార్టీల నాయకులను అతిథులుగా పిలవాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్ర ఫెడరేషన్ మహాసభ విశాఖపట్నంలో జరిగే నాటికి పెండింగ్లో ఉన్న మిగిలిన జిల్లాల మహాసభలను పరిపూర్తి చేయాలని జిల్లా శాఖలకు ఆదేశించింది. జర్నలిస్టుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించే విధంగా ఉన్న డిజిటల్ ప్రైవసీ చట్టానికి సంబంధించిన అంశంపై చర్చించేందుకు న్యాయ కోవిదులు జర్నలిస్టులతో కూడిన రౌండ్ టేబుల్ సమావేశం లేదా సదస్సును డిసెంబరు నెలాఖరులోగా విజయవాడలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ అంశంపై ఇప్పటికే ఎడిటర్స్ గిల్డ్ 35 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఐటి శాఖ ముందు ఉంచినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల సమావేశం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. నేషనల్ అలైన్ షాప్ జర్నలిస్ట్ ఇచ్చిన పిలుపుమేరకు జర్నలిజాన్ని కాపాడేందుకు జర్నలిస్టును రక్షించేందుకు వీలైన రీతిలో కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా శాఖలు సంసిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా శాఖలకు పిలుపు ఇచ్చింది. సంఘ నిర్మాణాన్ని మరింత పటిష్ట పరిచేందుకు వీలుగా అన్ని జిల్లాల కార్యవర్గాలను తక్షణం సమావేశపరిచి చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంసిద్ధం చేయాలని కోరింది. విజయవాడ బాలోత్సవ భవన్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అన్ని జిల్లాల నుంచి ఆఫీస్ బేరర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. సోహార్ధ ప్రతినిధులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ అసోసియేషన్ నుంచి హాజరైన ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ ఆరోగ్య పధకాలు**

## ప్రతి వక్కరు తెలుసుకోవాలి

**యూనివర్సల్ హెల్త్ కవరేజ్ 2025 అవగాహన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యూనివర్సల్ హెల్త్ కవరేజ్ 2025 అవేర్నెస్‌లో భాగంగా శుక్రవారం కంబాలపేట యు పి హెచ్ సి లో అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్ శ్రీ లక్ష్మి పాల్గొని మనం ప్రభుత్వాల నుండి ప్రతి ప్రజానీకానికి వైద్య పరంగా అందించుచున్న టువంటి వైద్య సదుపాయాల గురించి ప్రతి పౌరునికి తెలిసే విధంగా అవగాహన కల్పించాలని మరియు ఆరోగ్యం ప్రతి ప్రజానికం హక్కు అని తెలపడం జరిగినది. మరియు లీగల్ అథారిటీస్ తరఫున ప్రజానికం అందరికీ కూడా ఈ వైద్య సదుపాయాల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్య రంగంలో ప్రభుత్వం నిర్వర్తిస్తున్నటువంటి వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా మెంటల్ హెల్త్ వైద్యాధికారి డాక్టర్ అఖిలేంద్ర శ్రీనివాస్, యుపిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ అనూహ్య,యు పిహెచ్‌సి సూపర్వైజర్ డీడీ భవానీ, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కిల్కారి - చిన్నారి చిరునవ్వు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసరావుపేట షాలేం నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జిల్లా ఆశ ప్రోగ్రాం అధికారి సురేష్ మరియు కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు కలసి ఆశలు యొక్క పనితీరు సమీక్షా చేసారు. మంచిగ సేవలు అధించి మీ పరిధిలో ఉన్న తల్లీ బిడ్డల ఆరోగ్యంగ ఉడేలా చూడాలని చెప్పారు తరువాత కిల్కారి సేవలు పైన ట్రైనింగ్ ఇచ్చారు. కేంద్రం ప్రభుత్వం మాత శిశు మరణాలు తగ్గించడానికి ఈ కిల్కారి సేవలు ప్రవేశ పెట్టారు. గర్భిణీ 4 నెల నుంచి పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు నెలకు ఒక సారి వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం ఇస్తుంది. కిల్కారి కాల్ వచ్చే నెంబర్ 911600403660 ని గర్భిణీలు, బాలింతలు మొబైల్ సేవ్ చేసుకోవాలి అపుడు కాల్ వచ్చినప్పుడు వినగలుగుతారు. మరల వినాలి అనుకుంటే 14423 లేక 18005321255 టోల్ ఫ్రీ నెంబర్ కీ చేసి వినవచ్చు. ఈ కిల్కారి కాల్ లో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హై రిస్క్ గురించి, టీకాలు గురించి, కుటుంబ నియంత్రణ పద్ధతులు ఈ విధంగా తల్లీ బిడ్డల యొక్క ప్రాముఖ్యమైన ఆరోగ్య సలహాలు సూచనలు ఇస్తారు.ఈ విధంగా **Right time right information** విని సేవలు పోదుకొని పాటించటం ద్వారా తల్లీ బిడ్డలు ఆరోగ్యంగ ఉంటారు. కావున ప్రతి ఆశ మరియు ఏనఎం మీ పరిధిలో ఉన్న ప్రతి గర్భిణీలు, బాలింతలుకు కిల్కారి గురించి అవగాహనా కలిపించి, నెలకు ఒక సారి కాల్ వచ్చినపుడు పూర్తిగా వినేటట్లు చేయాలి. ఈ కార్యక్రమంలో సిఓ, ఏయన్‌యమ్‌లు మరియు ఆశలు ఉన్నారు.

# జిఎస్‌డబ్ల్యుఎస్ సిబ్బందికి రాష్ట్ర స్థాయి శిక్షణ




**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన పౌరులందరికీ సంక్షేమ పథకాలు మరియు సేవలను సజావుగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పౌర సేవలను కేటగిరీ-ఎ కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కుటుంబాల సమాచారాన్ని ధృవీకరించడం చాలా అవసరం. దీనిని సులభతరం చేయడానికి, కుటుంబ ప్రయోజన నిర్వహణ వ్యవస్థ కింద ఏకీకృత కుటుంబ సర్వేను నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ సర్వేలో, పౌరుల అందరి నుండి సమాచారాన్ని గ్రామ/వార్డ్ సచివాలయ స్థాయిలో GSWS సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరిస్తారు. ఈ కార్యాచరణలో భాగంగా, డిసెంబర్ 11 మరియు 12 తేదీలలో గుంటూరులో నాలుగు సెషన్లలో రాష్ట్ర స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినది. నిర్దేశించిన ప్రశ్నాపత్రం ద్వారా వ్యక్తిగత మరియు కుటుంబ స్థాయి సమాచారాన్ని సేకరించడానికి వివరణాత్మక విధానాలను ఈ శిక్షణలో వివరించడం జరిగినది. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు తరువాత గ్రామ/వార్డ్ సెక్రటేరియట్ స్థాయిలో మిగిలిన GSWS సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఎపి సెక్రటేరియట్ ప్రణాళిక విభాగం డైరెక్టర్, GSWS శాఖ సీనియర్ అధికారులతో కలిసి, రెండు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో జె.విజయలక్ష్మి, ప్లానింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ సచివాలయం వారు ఏకీకృత కుటుంబ సర్వే యొక్క ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. సర్వేను యాంత్రికంగా నిర్వహించకూడదని, రాష్ట్రంలోని అర్హులైన పౌరులందరికీ భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనాలను అందించాలనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్త మరియు అవగాహనతో నిర్వహించాలని చెప్పారు.

# మేరీ కుర్ట్జ్ మెమోరియల్ సెంటెనరీ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ దేవునికి అంకితం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని స్టేషన్ రోడ్డులో నూతనంగా నిర్మించిన మేరీ కుర్ట్జ్ మెమోరియల్ సెంటెనరీ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ ని దేవునికి అంకితం ఇచ్చే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని చర్చిని దేవునికి అంకితం చేశారు. ఆయన చేతుల మీదుగా చర్చి ప్రారంభోత్సవం జరగడం పట్ల పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రార్థనా మందిరం కేవలం ఇటుకలు, సిమెంటు తో చేసిన భవనం మాత్రమే కాదు, అది ప్రజలు దేవునిని కలుసుకోవడానికి, ఆరాధించడానికి ఉద్దేశించిన పవిత్రమైన స్థలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాస్టర్లకు బహుమతులు బహుకరించారు.

# జిల్లా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. రైతన్నా ! మీ కోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి సదస్సు ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలో భాగంగా వ్యవసాయం లాభదాయక పరిశ్రమ స్థాయిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రతీ ఎకరాకు మంచి ఆదాయం లభించాలన్నారు. ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని వీటిని వినియోగించుకుని సమగ్ర కార్యాచరణ ఉండాలన్నారు. సంబంధిత శాఖల మధ్య స్పష్టమైన సమన్వయం అవసరమని, లక్ష్యాల సాధనకు సంబంధిత రంగాలలో పనిచేస్తున్నారని భాగస్వామ్యం చేయాలని సూచించారు. సదస్సులో అందిన విధానపరమైన నిర్ణయాలను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఉత్తమ వ్యవసాయ కార్యకలాపాలను డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో అటువంటి డాక్యుమెంట్ లు ప్రదర్శించాలని అన్నారు.

### వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో 70,663 ఎకరాల సాధారణ విస్తీర్ణంకు గాను ఇప్పటి వరకూ 11,395 ఎకరాలలో పంటలు వేయడం జరిగిందన్నారు. జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాలకు సాగునీటి వసతులు లభ్యంగా ఉందన్నారు. వేసవి కాలంలో పంటలు వేసుకోవడం వలన స్థూల విలువ ఆధారిత పెంచవచ్చని చెప్పారు. చిరు ధాన్యాల పంటలు కూడా సాగు చేయాలని అన్నారు. వ్యవసాయ ముఖ్య శాస్త్రవేత్త డా.సి.వి.రమణ మాట్లాడుతూ రైతుకు మంచి ధర రావడం వలన మిరప సాగు విస్తీర్ణం పెరగగలదని అన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ పంట పొలాల గట్లు బలోపేతం చేయుటకు అవకాశం ఉందని తెలిపారు. పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేయడం వలన మంచి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సదస్సులో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ఎన్.కిరణ్ కుమార్, శాస్త్రవేత్తలు చంద్రమోహన్ రెడ్డి, శైలజ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, మంగళగిరి మండలంకు చెందిన ప్రగతిశీల రైతు టి.శివరాం రెడ్డి, ప్రగతిశీల రైతు శ్రీధర్ (కొల్లిపర), మిరప ఎగుమతుల సంఘం కార్యదర్శి తోట రామకృష్ణ, వట్టిచెరుకూరుకు చెందిన నాదెండ్ల ధనుంజయ రావు, మోహన్ రెడ్డి, వై.బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాగమ్మ ప్రతిష్టించిన శివాలయంను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో 11వ శతాబ్దంలో ఆనాడు నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివలయాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల సందర్శించారు. గామలపాడు గ్రామంలో ఆనాడు నిర్మిచిన శివాల యం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఇటీవల కాలంలో టీటీడీ బోర్డ్ మెంబెర్ జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పుణ నిర్మిస్తున్న శివలయాన్ని నేడు పల్నాడు జిల్లా కలెక్టర్ సందర్శించారు. ముందుగా కలెక్టర్ కృత్తికా శుక్లాకి ఆలయ అర్చకులు,స్థానిక రెవిన్యూ అధికారులు స్వాగతం పలికారు.అనంతరం కలెక్టర్ కృత్తికా శుక్లా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలను అక్కడ ఉన్న అధికా రులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కి వేద ఆచిర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళి,గ్రామ సచివాలయం సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

### యాప్ల పనిభారం తగ్గించాలని డిమాండ్ - మినీలకు మెయిన్ అంగన్‌వాడీల వేతనాలు చెల్లించాలి



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కాకినాడ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ టీచర్లు ఆయాలు ధర్నా నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఏరుబండి చంద్రావతిలు మాట్లాడుతూ గత ఆరేళ్ళ నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని, తక్షణం ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు అంగన్వాడీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్గా మారుస్తూ ఆదేశాలు మాత్రమే ఇచ్చారని, మెయిన్ సెంటర్ అంగన్వాడి వేతనాలు తక్షణం మినీలకు చెల్లించాలన్నారు. యాప్ల పేరుతో పని భారాన్ని తగ్గించాలని అన్ని యాప్లు కలిపి ఒకే యాప్ గా మార్చాలని, అంగన్వాడీ సెంటర్లను పాఠశాలల్లో విలీనాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అంగన్వాడీ బడి పిల్లలకు స్నాక్స్ ఇవ్వడం మానేశారని, తక్షణం పునరుద్ధరించి పిల్లలకు మెరుగైన పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు అంగన్వాడి బడ్జెట్ను పెంచాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్లు అనేక హామీలు, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం తప్పితే, అధికారంలోకివచ్చి 15 నెలలు గడుస్తున్నా అంగన్వాడీల సమస్యలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. 42 రోజుల సమ్మె ఏకబిగిన చేసిన అనుభవం అంగన్వాడీలకు ఉందని గుర్తుచేశారు. దశల వారి పోరాటాలకు అంగన్వాడీ ఆయాలు, టీచర్లు, మినీలు, సిద్ధపడి వేతనాలు పెంచుకునేందుకు పోరుబాటకు సిద్ధపడలాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, సిఐటియు జిల్లా



ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, మలకా రమణ అంగన్వాడిలను ఉద్దేశించి మాట్లాడారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు విజయ, రాజేశ్వరి, ఎస్తేరు రాణి, టిఎల్ పద్మ, పి వీరవేణి, పి వీరమణి, తులసి దేవి, జి బుల్లెమ్మ, అల్లాడి లక్ష్మీ, కె సునీత, పి సుజాత, టి నాగమణి, ఏ మంగాదేవి, జిల్లా కోశాధికారి ఆర్ రామలక్ష్మీ, ధనలక్ష్మి, సిహెచ్ రత్నం, రాణి, విజయశాంతి, జ్యోతి, రమణమ్మ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

# సలాదికి అభినందనల వెల్లువ



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నూతన కమిటీ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సలాది నాగేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలియజేశారు. పెదపల్ల పంచాయతీ కార్యదర్శి వి.వేణి కార్యాలయ సిబ్బంది సలాది నాగేశ్వరావు స్వగృహానికి వెళ్లి దుస్సాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనపై ఎంతో అభిమానంతో కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి కృపతో నూతన ఆలయ కమిటీ సభ్యులుగా నియమించారని తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ స్వామివారి భక్తులకు మెరుగైన వసతులను కలగ చేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# 360 మంది మహిళలు అఖండ జ్యోతి ప్రదర్శన



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో మార్గశిర మాసం లో పురస్కరించుకుని గురువారం పుల్ల ధర్మరాజు దంపతుల ఆధ్వర్యంలో వారి యొక్క సత్సంగ సభ్యులు, గ్రామస్తులు కలిసి ముందుగా అమ్మవారికి కుంకుమ పూజ చేసి అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి తలపై పెట్టుకుని 360 భక్తులు మేళతాళాలతో భజన కార్యక్రమాలతో గ్రామం అంత అమ్మవారిని రథంపై గ్రామోత్సవం జరుపడుతుంది. కనకదుర్గ అమ్మవారి గుడికి నూతన నిర్మాణానికి రూ.50,000 కమిటీ వారికి అందజేయడం జరిగింది.పుల్ల ధర్మరాజు, తూము కమల, అడప పెద్ద కాపులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్సంగ సభ్యులు గ్రామస్తులు కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయం నిర్మాణం కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

# నేడు రాయవరంలో భారీ హిందూ సమ్మేళనం

### ప్రక్క గ్రామాల వారికోసం ప్రత్యేక రవాణా సదుపాయం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందువులందరి నీ ఐక్యత పరిచే విధంగా దేశవ్యాప్తంగా జరుగు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు తాడి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో శుక్రవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమావేశ మందిరంలో నిర్వహించిన హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కార్యక్రమంలో సమితి అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది తాడి రామచంద్ర రెడ్డి పాల్గొని, మాట్లాడుతూ మాట్లాడుతూ రాయవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమావేశ ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి భగవత్ చింతనతో, ధార్మిక చర్చలతో కూడిన భారీ హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వల్లూరి శ్రీనివాస్ చౌదరి, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కోశాధికారి చాత్రాతి జానకి రాంబాబు, ప్రముఖ న్యాయవాది బినయ్ బాబు, ఆవుపాటి శివ, ముప్పాటి కృష, నడింపల్లి రామారావు తదితరులు హాజరయ్యారు.

# ఎరువులు విషయంలో ఆందోళన వద్దు : రమేష్ కుమార్



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో గల పది రెవెన్యూ గ్రామాల్లోనూ సుమారు 16 వేల ఎకరాలు సాగుభూమి ఉందని, దాళ్వా పంటకు రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి ఉంచుతామని మండల వ్యవసాయాధికారి కెవిన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా దాళ్వా పంట సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఏవో రమేష్ కుమార్ శుక్రవారం ప్రకటన ద్వారా పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు మొత్తం 2100 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని, మొదటి దఫాలో వరి పంట ఎకరానికి ఒక బస్తా యూరియా చొప్పున 700 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మొదటి దఫా నిమిత్తము 380 మెట్రిక్ టన్నులు యూరియాను 133 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రం ద్వారా, 166 మెట్రిక్ టన్నులు యూరియా పి.ఎ.సి.ఎస్ ద్వారా, 80 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లు ద్వారా అందుబాటులో ఉంచి రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. సుమారు 120 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే వారంలో రైతులకు అందుబాటులో ఉంటుందని వివరించారు.

# మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి

### ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో ఎల్పిజి కనెక్షన్లు పంపిణీ చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**కె. గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా సాధికారత, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కె గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన ఎల్పీజీ కనెక్షన్లను లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ దేశంలో పేద కుటుంబాలకు స్వచ్ఛ వంట ఇంధనం (ఎల్‌పీజీ) కనెక్షన్లు అందించడం లక్ష్యంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన ప్రారంభించారన్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఎల్‌పిజి కనెక్షన్లను అందించడం ద్వారా వారి ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఇంటి పొగ కాలుష్యాన్ని తగ్గించి శ్వాస సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ఉద్దేశంతో పథకం విజయవంతంగా అమలు జరుగుతుందన్నారు. రామచంద్రపురం నియోజవర్గం లోని ప్రజల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ నియోజకవర్గంలో సత్వర వైద్య సేవలు అందించేందుకు త్వరలో ఒక బస్సును ఏర్పాటు చేయనున్నారని, అలాగే ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. ఒక ప్రత్యేకమైన విజన్ తో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా నిధులు తీసుకొస్తున్నారని వివరించారు. మహిళాభివృద్ధికి, సాధికారతకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. బిజెపి అనకాపల్లి జిల్లా ఇన్చార్జి కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆపద్బాంధవుడులా ఆదుకుంటున్నారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, బిజెపి నాయకులు సలాది శేఖర్, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, బిజెపి గంగవరం మండల ఇంచార్జ్ రాఘవేంద్ర, రామచంద్రపురం మండల ఇన్చార్జి అవసరాల వెంకటరమణ మూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షులు బల్లెం నాని తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు అధికారి జి.బిందుమాధవ్ ఈ నెల 22వ తేదీన కాకినాడ థర్డ్ ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్స్‌లో నిర్వహించబోయే ఎస్సీటీపీసీస్ (ఎస్‌సిటీపిసిఎస్) ట్రైనింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్‌తో పాటు ట్రైనింగ్ ఇనస్ట్రక్టర్స్ కు పలు సూచనలు అందజేశారు. బెటాలియన్ గ్రౌండ్స్‌లో జరుగబోవు ఎస్సీటీపీసీస్ ట్రైనింగ్ ఏర్పాట్లను ఎస్పీ ప్రత్యక్షంగా పరిశీలించారు. శిక్షణా కార్యక్రమం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి అభ్యర్థి సమగ్రంగా శిక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్, అకడమిక్ సెషన్లు, ఫైరింగ్ ప్రాక్టీస్, లా క్లాస్ తరగతి గదులు తదితర అంశాలపై బెటాలియన్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ట్రైనింగ్ సమయంలో శిక్షణార్థుల భద్రత, ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు సమగ్రంగా అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.శిక్షణా ప్రమాణాలు రాష్ట్ర స్థాయిలో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. బెటాలియన్ కమాండెంట్, ట్రైనింగ్ అధికారులు తమ ప్రణాళికలను, అమలు విధానాలను ఎస్పీకి వివరించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో క్రమశిక్షణ గల సిబ్బంది అత్యంత కీలకమని, ఈ ట్రైనింగ్ ద్వారా ఉత్తమ సిబ్బంది తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.రాబోయే ఎస్సీటీపీసీస్ ట్రైనింగ్‌ను అత్యుత్తమంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమములో ఎఆర్ అడిషనల్ ఎస్పి ఎస్. శ్రీనివాసరావు, మూడవ బెటాలియన్ ఐ/సి కమాండెంట్ ఎస్. దేవానంద్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి కె. వి. సత్యనారాయణ,ఎఆర్ డిఎస్పి వి. శ్రీహరిరావు, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించడంపై అవగాహనా ర్యాలీ : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, అమలాపురం పట్టణ పోలీసులు శుక్రవారం హెల్మెట్ ధరించడం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక ప్రత్యేక బైక్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. అమలాపురం పట్టణ సీఐ వీరబాబు , ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ యేసుబాబుల ఆధ్వర్యంలో క్లాక్ టవర్ నుండి ప్రారంభించి, బ్లాక్ బ్రిడ్జి, రెడ్ బ్రిడ్జి, హై స్కూల్ సెంటర్ మీదుగా తిరిగి క్లాక్ టవర్ వరకు ర్యాలీ కొనసాగింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల కలిగే భద్రత ప్రాణాలను కాపాడుకునే ప్రాముఖ్యత గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు, తెలియజేయడం. సీఐ వీరబాబు, మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ "హెల్మెట్ ధరిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రయాణం చేయాలని కోరారు. రహదారి ప్రమాదాలలో తలకు గాయాలు కావడం వల్లే అధిక శాతం ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ఈ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు భవిష్యత్తులో కూడా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ ర్యాలీలో పోలీసు సిబ్బందితో పాటు, స్థానిక యువకులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శించారు.

# కాకినాడలో ఓటర్ల మ్యాపింగ్‌కు ప్రత్యేక శిబిరాలు..

### ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు..

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల మ్యాపింగ్ పురోగతిని వేగవంతం చేయడానికి ఈ నెల 13, 14 తేదీల్లో శని, ఆదివారాలలో ప్రత్యేక మ్యాపింగ్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇఆర్‌ఓగా వ్యవహరిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) పెండింగ్‌లో ఉన్న ధృవీకరణ పనులు, కుటుంబ సభ్యుల (సంతాన) మ్యాపింగ్ కార్యక్రమాలను పూర్తి చేస్తారని వివరించారు. పార్ట్ మ్యాపింగ్ శాతం 30% కంటే తక్కువగా ఉన్నప్పుడు, శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవడం, పెండింగ్‌లో ఉన్న ధృవీకరణలను పూర్తి చేసుకోవడం, కుటుంబ సభ్యుల వివరాలను మ్యాప్ చేయించుకోవడం కోసం ఈ శిబిరాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.



# కొత్తపేటలో వైభవపేతంగా విశిష్ట అనఘాష్టమి వ్రతము

### సాయిబాబా మందిరానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ షిరిడిగా పేరుగాంచిన కొత్తపేట సాయిబాబా మందిరంలో విశిష్ట అనఘాష్టమి వ్రతం శుక్రవారం వైభవపేతంగా జరిగింది.మార్గశిర బహుళ అష్టమి రోజున సంవత్సరంలో ఒకరోజు జరిగే ఈ అనఘాష్టమి వ్రతమును ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పైడిమర్రి మణికంఠ రామకృష్ణ ఆధ్వర్యంలో కప్పగంతుల రవితేజ శాస్త్రోక్తంగా పూజ జరిపించారు. వ్రతము యొక్క విశిష్టతను భక్తులకు తెలియజేశారు.ఈ వ్రతము ప్రతినెల అష్టమి రోజున యధావిధిగా జరుగుతుంది. కాగా ప్రత్యేకత సంతరించుకున్న సంవత్సరం చివరి మాసంలో మార్గశిర బహుళ అష్టమి రోజున వైభవ్తేత్తంగా ఆలయ కమిటీ వారు నిర్వహిస్తారు. ఇంతటి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విశిష్ట అనఘాష్టమి వ్రతములో సుదూర ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు. సుమారు నాలుగువేల మంది భక్తులు పైగా అన్న ప్రసాదాలు స్వీకరించారు అని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

# ఈ నెల 19వ తేదిన మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ రాక...

### రెండవ విడత టిడ్కో ప్లాట్లను టిడ్కో ఎం.డి.తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ...



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం గొల్లపుంత కాలనీలో టిడ్కో సెకండ్ ఫేజ్ లో ఉన్న ప్లాట్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు ఈ నెల 19వ తేదిన మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ మండపేట విచ్చేస్తున్నారు. ఈ నేపధ్యంలో శుక్రవారం టిడ్కో సముదాయలను టిడ్కో ఎం.డి సునీల్ కుమార్ రెడ్డితో కలిసి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదిన మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సెకండ్ ఫేజ్ లో ఉన్న ప్లాట్లను లబ్ధిదారులకు అప్పగించనున్నారని తెలిపారు. టిడ్కో కాలనీ లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలను పూర్తి చేశామన్నారు. ప్లాట్లలో పెండింగ్ లో ఉన్న చిన్న పనులు పూర్తి చేయవలసి వుందని టిడ్కో ఎం.డి కి తెలిపారు. పెండింగ్ లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ వార్డు కౌన్సిలర్లు, ఇంచార్జీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, టిడ్కో లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.





# కూటమి ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలను సాగనివ్వం..

### కోటి సంతకాల ర్యాలీలో బుల్లెట్ నడుపుతూ కార్యకర్తలలో జోష్ నింపిన ఎమ్మెల్సీ తోట - భారీగా హాజరైన పార్టీ శ్రేణులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పేద ప్రజల విద్యా వైద్య ఆరోగ్యానికి సంబంధించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైయస్సార్సీపి తరపున అడ్డుకుంటామని మండపేట నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గం వ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాలకు ప్రత్యేక వాహనం లో జిల్లా కేంద్రం అమలాపురానికి తరలించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుండి పెద్ద ఎత్తున వైసిపి కార్యకర్తలు నాయకులు తరలివచ్చారు. ర్యాలీలో బుల్లెట్ మోటార్ సైకిల్ నడిపి ఎమ్మెల్సీ తోట అందర్నీ ఆకట్టుకున్నారు. తొలుత వైసిపి కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు తగిన వైద్య సౌకర్యం లేక పాఠశాలలు, ప్రైవేటు భవనాలలో వైద్యం చేయించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆనాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం ఆలోచన చేసి ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలని తద్వారా కరోనా వంటి మహమ్మరి వ్యాప్తి చెందినప్పుడు ఎక్కడికి అక్కడ ప్రజలకు వైద్యం అందుతుందని వీటిని స్థాపించారన్నారు. 17 చోట్ల వైద్య కళాశాలలు ప్రారంభించి వాటికి ఒక్కొక్క దానికి 50వేల ఎకరాలు చొప్పున కేటాయించి పనులు ప్రారంభించారన్నారు. చాలా చోట్ల ఇవి పూర్తికాగా మరికొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ తరుణంలో దురదృష్ట వశాత్తు వైసిపి ఓటమి చెందడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం దోచుకోవడమే పనిగా ఉన్న కూటమి ప్రభుత్వ పెద్దలు వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనీ విమర్శించారు. పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు వైద్యానికి చేరువ కాకుండా సంపాదనే ధ్యేయంగా అడ్డుగోలుగా ప్రైవేటీకరణ ప్రతిపాదన తెచ్చారని మండిపడ్డారు. దీనిపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల కార్యక్రమానికి పిలుపు నిచ్చారన్నారు. మండపేట నియోజవర్గంలో 58 వేల సంతకాల స్వచ్ఛందంగా చేశారని వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అన్నిచోట్ల ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని స్పష్టం చేశారు. వైసిపి కార్యకర్తలు నాయకులు ఇంటింటికి తిరిగి శక్తి వంచన లేకుండా ప్రజల పక్షాన సేకరణ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వాన్ని మెడలు వంచి ఈ ప్రైవేటీకరణను అడ్డుకునే వరకు అలుపెరగని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంకు ఈ సంతకాలు పంపిస్తానని పేర్కొన్నారు. సేకరించిన సంతకాలను ఈ నెల 15న అమరావతి తరలిస్తారని ఈ నెల 18న రాష్ట్ర గవర్నర్ ను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కలిసి ఈ సంతకాలను అందజేసి ప్రైవేటీకరణకు సంబంధించిన అంశాలను వివరిస్తారని చెప్పారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ప్రభుత్వానికి సూచనలు చేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం బుల్లెట్ మోటార్ సైకిల్ వాహనంపై ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. రాజరత్న సెంటర్,బస్టాండ్, కలవపువ్వు సెంటర్, అయ్యప్ప స్వామి ఆలయం నుండి బైపాస్ రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, రాష్ట్ర జిల్లా పార్టీ నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం...

### పీపీపీ విధానంలో రెండేళ్లలోనే కాలేజీ నిర్మాణాలు, 1750 సీట్లు విద్యార్థులు పొందుతారు.. : ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో (పీపీపీ) మెడికల్ కాలేజీలను నిర్మించి, పేద విద్యార్థులకు వైద్య విద్యలో అవకాశాలు పెంచే దిశలో చర్యలు చేపడుతుంటే అది చూసి ఓర్వలేని జగన్ ముఠా పీపీపీ విధానంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండిపడ్డారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పీపీపీ విధానం గురించి వైసీపీ రాజకీయ స్వార్థంతో, తప్పుడు ప్రచారంతో ప్రజల్లో లేనిపోని అపోహల్ని, భయాల్ని కలిస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ ముఠా రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం సరికాదన్నారు. అబద్ధపు ప్రచారాలు నమ్మే అమాయకులు కాదు ఆంధ్రులు అని జగన్ & కో గుర్తుంచుకోవాలన్నారు. నిజానికి పీపీపీ విధానంలో కోటీ సంతకాల సేకరణతో జగన్ ముఠా ప్రచారం చేస్తున్నది అంతా డ్రామానే అన్నారు. వైసీపీ 5 ఏళ్లపాలనలో మెడికల్ కాలేజీలకు రాష్ట్ర బడ్జెట్ నుండి ఒక్క పైసా అయిన ఖర్చు చేశామని లెక్కలు చెప్పే దమ్ము వైసీపీ నాయకులకు ఉందా అని సవాల్ విసిరారు.కర్ణాటక, ఉత్తరప్రదేశ్ జార్ఖండ్ వంటి రాష్ట్రాల అనుభవాలను పరిగణలోకి తీసుకుని, అక్కడ ఎదురైన సమస్యలను నివారించేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. పీపీపీ విధానంలో రెండేళ్లలోనే కాలేజీ నిర్మాణాలు పూర్తి అవుతాయన్నారు. దీనివలన 1750 సీట్లు మన విద్యార్థులు పొందుతారన్నారు. పీపీపీ విధానంలో ప్రభుత్వమే వైద్య కళాశాలలు ఆసుపత్రుల యాజమాన్యాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ ఎంబీబీఎస్ సీటుకు రూ.12 లక్షలు, ఎన్.ఆర్.ఐ సీటుకు రూ.20 లక్షలు ఫీజు నిర్ణయించి కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లల్లో 50శాతం ఎంబీబీఎస్ సీట్లను ప్రైవేటీకరించింది జగన్ కాదా అని ప్రశ్నించారు. ఇకనైనా జగన్ ముఠా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పిల్లా తాతలు, గుణ్ణం సాయిబాబా, దేవళ్ళ వెంకట్రావు, సాదా రవిభాస్కర్, వీధి ప్రసాద్, తదితర్లు పాల్గొన్నారు.

# మాదిగల ద్రోహి జగన్మోహన్ రెడ్డి

### మా పెద్ద మాదిగ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై చేసిన అనుచిత వ్యక్యాలను ఎమ్మార్పీఎస్ నాయకులు, కూటమి తీవ్రంగా ఖండించారు. అంబాజీపేట మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో జనసేన నాయకుడు ఉందుర్తి నాగబాబు అద్యక్షతన శుక్రవారం విలేఖర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ హెచ్ ఆర్ డి సభ్యుడు నేదునూరి వీర్రాజు మాట్లాడుతూ నిన్న జరిగిన వనబోజనాలు అన్ని పార్టీలలో ఉన్న మాదిగలు అని వేదిక మీద ఉన్న నాయకులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని గురువారం ( నిన్న ) జరిగిన మాదిగ వనబోజనాలు కేవలం వైసిపి పార్టీది మాత్రమే నని తెలుగుదేశం పార్టీలో ఉన్న కొంతమంది తెలుగుదేశం పార్టీలో పని చేస్తూ వైసిపి పెట్టిన వనబోజనాలలో పాల్గొన్నారని వారు కుడా కేవలం సింగిల్ డిజిట్లోనే ఉన్నారని వారి వ్యవహారం పార్టీ చూసుకుంటుందని అన్నారు. మాదిగల మహాత్ముడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సారద్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేసి పెద్దమాదిగ అయ్యారని. మాదుగజాతికి రాజ్యాంగ పలాలు అందించిన చంద్రబాబు నాయుడుని వైసిపి ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ చరిత్రహీనుడు అన్న విషయమై తీవ్రంగా ఖండించారు. 2026 జనవరి 25 వ, తేదీన మాదిగల మహాత్ముడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆద్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాదిగ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి మంత్రివర్యులు వంగలపూడి అనిత, పోలిట్ భ్యూరో సభ్యులు జాతీయ ప్రధానకార్యదర్శి వర్ల రామయ్య, ఎంపీ యెన్నేటి కృష్ణ ప్రసాద్, మాదిగ సాజికవర్గ శాసనసభ్యులు, నాయకులను పిలిచి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రర్యమానికి పద్మశ్రీ కృష్ణ అన్న సైన్యంతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులందరూ శక్తివంచన లేకుండా కృషిచేసి విజయవంతం చేస్తామన్నారు. జనసేన నాయకులు నాగబాబు మాట్లాడుతూ కే పెదపూడి గ్రామంలో బిజెపి నాయకులు కొల్లి సూర్యారావు మరణించినప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న బొమ్మి ఇజ్రాయిల్ పదివేల రూపాయలు ఇస్తానని వాగ్దానం చేశాడు. ఇప్పటివరకు ఇవ్వలేదని ఉందుర్తి నాగబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈతకోట నాగరాజు, దిగుమర్తి చిట్టిబాబు, చేట్ల రవి, మంద నాగరాజు, ముమ్మిడివరపు కృష్ణకాంత్, లంక రెడ్డి, తొత్తరమూడి ఆనంద్, ఈతకోట శ్రీను, నేదునూరి శ్రీను, నేదునూరి రాము, నవుండ్రు శ్రీనివాస్ తదితుర్లు పాల్గొన్నారు.

### వాడపల్లి వెంకన్న ఆలయంలో

# బహిరంగ వేలం

### దేవస్థానానికి భారీగా పెరిగిన ఆదాయం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాబోయే ఏడాది కాలానికి సంబంధించి గురువారం బహిరంగ వేలం సీల్డ్ టెండరు –ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించగా దేవస్థానానికి మంచి ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. దేవస్థానంలో గృహ సంకల్పం ఇటుకల పాటను ఒక సంవత్సరం కాలానికి రూ.59,09,999 కు దొడ్డ లక్ష్మణరావు దక్కించుకున్నారని చెప్పారు. గతంలో ఈ టెండర్ 5.35,66,999 : 5.23,43,000 అధికంగా ఆదాయం లభించిందన్నారు. అలాగే దేవస్థానంలో పచ్చి గో గ్రాసం అమ్ముకునే హక్కును ఒక సంవత్సరం కాలపరిమితికి రూ.10,09,999 కు అడపా వరప్రసాద్ పొందారని తెలిపారు. గత సంవత్సరం ఈ హక్కు రూ.1,25,000 పాడగా ఈసారి దేవస్థానానికి రూ.8,84,999 ఆదాయం అదనంగా వచ్చినట్లు తెలిపారు. ఆలయంలో సెక్యూరిటీ సేవలు, పూజా సామగ్రి సరఫరా, షామియానాల ఏర్పాటు, పాత న్యూస్ పేపర్లు, అట్టముక్కలు, ఖాళీ సంచులు, పాతఇనుప సామగ్రి తొలగింపు హక్కులు, పార్కింగ్ వద్ద షాపులు వంటి వాటికి సంబంధించిన బహిరంగ వేలం పాటలు, బాక్స్ టెండర్లు, ఆన్లైన్ టెండర్లు కూడా నిర్వహించామని తెలిపారు. ఆలయానికి చెందిన 5 షాపులు రూ.50.709 పాట పొందారని, గత సంవత్సరం కంటే రూ.5300 ఎక్కువగా ఆదాయం లభించిందన్నారు. 26 షాపులకు వేలం పాట పెట్టగా అందులో 8, 28, 56, 95, 97 నెంబర్ షాపులు వేలానికి వెళ్ళాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్ రాజు), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, గ్రేడ్ 3 ఈవో ఎం.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ నిర్వహించామని, ఈ సందర్భంగా 667 అర్జీలు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల వద్ద స్వీకరించినట్లు తెలిపారు. ఈ అర్జీల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే ఆనందరావు చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి బాబ్జి, అమలాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, పెచ్చెట్టి విజయలక్ష్మి, అరిగెల నానాజీ, దిన్న బాబు, పిండి రాజా, బొర్రా వెంకటేశ్వరరావు, దున్నాల దుర్గ, చింతశంకర్ మూర్తి, కర్రీ రామస్వామి, పచ్చిమాల ఏడుకొండలు, బొర్రా ఈశ్వరరావు, నల్లా చిట్టి, నల్లా మల్లిబాబు ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారుకు కృతజ్ఞతలు తెలిపిన అగ్నికుల క్షత్రియ సంఘాలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం పాలకమండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా అగ్నికుల క్షత్రియులైన కొత్తపేట మండలం వానపల్లికి చెందిన మాస్కపల్లి త్రిమూర్తులును నియమించినందుకు ఎమ్మెల్యే బండారుకు ఆ సామాజిక వర్గీయులు కృతజ్ఞతలు తెలియజేశారు. క్యాంప్ కార్యాలయంలో వారంతా ఎమ్మెల్యేను కలుసుకుని ధన్యవాదాలు తెలిపారు. పాలకమండలిలో పాయక రావుపేటకు చెందిన గోశాల అప్పలనరసమ్మ ఇప్పటికే సభ్యులుగా స్థానం పొందారని, మాస్కపల్లి త్రిమూర్తులును ప్రత్యేక ఆహ్వానితులుగా సైతం అవకాశం కల్పించడం సంతోషదాయకమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడు విగ్రహాన్ని ఆలయం వద్ద ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వారికి తెలిపారు.అగ్నికుల క్షత్రియ సామాజికవర్గానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలియజేశారు.

# బిసి చైతన్య వేదిక భారీ బహిరంగ సభ : రెడ్డి సుబ్రహ్మణ్యం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 28వ తారీఖున, ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు, ఈతకోట సెంటర్ యందు, (రావులపాలెం, కోనసీమ ముఖద్వారంనకు మూడు కిలోమీటర్లు దూరంలో నేషనల్ హైవే ప్రక్కన) బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో, భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతోంది. బీసీలలో ఉన్న అన్ని వర్గాల వారు, పార్టీలకు అతీతంగా,బీసీలందరూ ప్రత్యేక ఆహ్వానితులే! రండి! తరలి రండి! జయప్రదం చేయండి! బీసీల సత్తాను చాటండి బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,బీసీ చైతన్య వేదిక నాయకులు ఆధ్వర్యంలో, ఈనెల డిసెంబర్ 28వ తారీఖున ఆదివారం 2 గంటలకు, ఈతకోట సెంటర్ నందు బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతున్నదని, బీసీల్లో ఉన్న అన్ని వర్గాల ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, బిసి మహిళ నాయకులు, బీసీ ప్రజాప్రతినిధులు, బీసీల్లో ఉన్న అన్ని వర్గాల బీసీలు అందరూ ఆహ్వానితులేనని, ఈ బీసీ సభకు, బిసి యువత, బిసి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, మహిళలు భారీగా తరలి రావాలని, విజయవంతం చేయాలని కోరుకుంటూ, బీసీలు అందరిని ఐక్యం చేస్తూ, బీసీ చైతన్య వేదిక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని, బీసీ చైతన్య వేదిక నాయకులు తెలియజేశారు.రాష్ట్ర బీసీ ప్రముఖ నాయకులు, శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంని,వారి స్వగృహంలో కలిసి, వారిని ప్రత్యేక ఆహ్వానితులుగా రావాలని, బీసీలకు మరింత అండగా ఉండాలనీ,ఆర్ ఎస్ వారికి, బీసీ చైతన్య వేదిక నాయకులు ఆహ్వానం అందించడం చాలా సంతోషంగా ఉన్నదని,బీసీ చైతన్య వేదిక నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు. బీసీ నాయకులుగా, బీసీ సంఘీయులుగా, బీసీలు ప్రతి ఒక్కరు, ఈ కార్యక్రమంలో పాల్గొని, బీసీలకు న్యాయం జరిగేలా, బీసీల హక్కులను, డిమాండ్లను సాధించుకోవాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన సమన్యాయం జరిగే విధంగా, స్థానిక సంస్థలలోను, చట్టసభల్లోనూ, పలు నామినేటెడ్ పదవుల్లోనూ, రాష్ట్ర, దేశ జనాభాలో సగభాగమున్న బీసీలకు రిజర్వేషన్లను 50% కేటాయించేలా ప్రభుత్వాలు, అన్ని పార్టీలు, న్యాయబద్ధంగా, బిసిలకు న్యాయం చేయాలని, బీసీలకు రక్షణ చట్టం ఎంతో అవసరమని, బీసీలు ఐకమత్యంగా ఉండి రాజ్యాధికారం వైపు పయనించాలనే నినాదంతో,బీసీ మహిళలకు, మహిళ రిజర్వేషన్లలో 50% రిజర్వేషన్ కేటాయించాలని, బీసీలకు అన్ని రంగాలలోనూ సగభాగం రిజర్వేషన్ల అమలు కోసం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని సవరించి, చట్టం చేయాలని, బీసీలు ఆర్థికంగా, సామాజికపరంగా ఎంతో వెనుకబడి ఉన్న బీసీ కులాలు, ఎంతో అభివృద్ధి పథంలోకి రావాలంటే, బీసీలంతా ఐక్యమత్యంతో ముందుకు వచ్చి, ఏక తాటిపై నిలబడాలని కోరుకుంటూ, బీసీలలో ఉన్న 139 బిసి కులాల వారిని, ఈ వేదిక ద్వారా భాగస్వామ్యం, ఐక్యం చేస్తూ, బీసీలంతా, ఈ సభకు వచ్చి విజయవంతం చేయాలని, బీసీ చైతన్య వేదిక నాయకులు కోరుతున్నారు బిసి సభను, బీసీల భారీ బహిరంగ సభగా,బీసీల్లో ఉన్న, అన్ని వర్గాల వారు, ఒకే వేదిక పైకి వచ్చి, బీసీ చైతన్య వేదికకు, బీసీలు భారీ మద్దతుగా నిలబడాలని, ఈ సభకు బీసీలంతా, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తరలిరావాలని పిలుపునిస్తూ, కోరుకుంటూ, ఈ సభ ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు ఈ సందర్భంగా బీసీ చైతన్య వేదిక నాయకులు జాతీయ అధ్యక్షులు వీరవెల్లి శ్రీనివాస్ (భీమవరం) వారి నాయకత్వంలో, అంబేద్కర్ కోనసీమ జిల్లా బీసీ చైతన్య వేదిక అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్ ఎక్స్ సర్పంచ్ (గంగుల కుర్రు) వారి ఆధ్వర్యంలో, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టపర్తి సూర్యచంద్రరావు రాష్ట్ర గీత కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు (కొత్తపేట), బీసీ చైతన్య వేదిక కోనసీమ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ప్రముఖ అడ్వకేట్ బొంతు గౌరీ శంకర్ (వానపల్లి), బీసీ చైతన్య వేదిక జిల్లా నాయకులు దూనబోయిన పల్లంరాజు ఎక్స్ ఎంపీటీసీ (వానపల్లి), బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయుడు లక్ష్మణరావు (ఆలమూరు మండల పరిషత్ ఫ్లోర్ లీడర్, చొప్పెల్ల ఎక్స్ ఎంపిటిసి) తెలియజేశారు.

### మండల పార్టీ అధ్యక్షులు అందరినీ

# సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి



### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నాయకత్వ పటిమ, పార్టీ పట్ల అంకితభావంతో, అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళ్తూ పార్టీ బలోపేతానికి మండల పార్టీ అధ్యక్షులు కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుల కోసం నిర్వహించిన అవగాహన తరగతులకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్యాడర్ నిర్వహణతో పాటు లబ్ధిదారులకు పథకాల కార్యాచరణ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని,సోషల్ మీడియాల బాధ్యతాయుతమైన వినియోగంపై విలువైన సూచనలు అందించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో మండల పార్టీ అధ్యక్షుల పాత్ర ఎంతో కీలకమన్నారు.



# శంఖవరంలో 13న ఉచిత హోమియో వైద్య శిబిరం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘ భవనంలో శనివారం ఉదయం 9 గంటల నుండి ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పిఠాపురం ఈకె హోమియో ఆస్పత్రి తన వైద్య సేవలను ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శంఖవరం శ్రీ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో శంఖవరం మండలంలోని ఆర్య వైశ్య సంఘ సభ్యుల్లోని వైద్య సేవలు అవసరమైన వారు అందరూ కూడా ఈ వైద్య శిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచిత మందులను తీసుకుని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రాయోజిత నిర్వాహకులైన శంఖవరంలోని స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం తరఫున ముఖ్యఅతిథిగా హాజరు అవుతున్న శంఖవరం మండలం పెదమల్లాపురం పంచాయతీ శివారు సిద్ధివారిపాలెంలోని ఆంధ్ర శబరిమలై వ్యవస్థాపక ధర్మకర్త భూపతి కుసుమంచి శ్రీసత్య శ్రీనివాసరావు గురుస్వామి శుక్రవారం ఈ ప్రకటన విడుదల చేశారు.

### మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని

# కలిసిన ధరణికోట అభిషేక్..



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండల వైకాపా సోషల్ మీడియా ఉపాధ్యక్షులు సీనియర్ వైసీపీ నాయకులు ధరణికోటి అభిషేక్ గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపరంగా కలుసుకున్నారు. ఇటీవల మాజీ మంత్రి వైకాపా ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆశీస్సులతో నాకు కాకినాడ రూరల్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలుగా ఈరోజు వైయస్సార్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలుసుకున్నామని అభిషేక్ తెలియజేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే

# ధ్యేయంగా ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని, నిత్యం ప్రజల సమస్యల స్వీకరణ కొనసాగించడమే కాకుండా, ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా ప్రజల నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు తీసుకుంటా వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం జగన్నాధపురం శాసనసభ్యులు వారి క్యాంప్ కార్యాలయం నందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయడం జరుగుతుందని, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం స్పెషల్ డేగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో గ్రీవెన్స్ డే'గా కార్యక్రమాన్ని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే విధంగా రూపొందించి ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డు చేసి, దాని పరిష్కారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనిట్ ఇన్చార్జులు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 15 కోట్లతో ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధి

**అన్నవరం సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతా.. - ప్రభుత్వ అధికారులు ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చాలి**
**ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రకటన - ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన అన్నవరం సర్పంచ్**



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ 18 నెలల కాలంలోనూ వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు దాదాపు రూ. 15 కోట్లను వెచ్చించామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పెద్దల సంపూర్ణ సహకారంతో ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తూ వస్తున్నాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శంఖవరం మండలం అన్నవరంలో స్థానిక పంచాయతీ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా సారధ్యంలో ప్రభుత్వ నిధులు రమారమి రూ. కోటితో చేపడుతున్న వివిధ ప్రజా అభివృద్ధి సంక్షేమ పథకాల పనులకు ఎమ్మెల్యే సత్యప్రభ, కూటమి నేతలు శుక్రవారం ఉదయం టెంకాయలను కొట్టి ప్రారంభించారు. ఆయా అభివృద్ధి పనుల ప్రజా సమాచార శిలా ఫలకాలను ఆవిష్కరించారు. గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పెండ్యాల సతీష్ ఇంటి నుండి ములగపల్లి వీరబాబు గారి ఇంటి వరకు రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, వెలమ పేటలోని లక్ష్మీగణపతి గుడి సమీపంలో సీసీ రోడ్డు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి పంపా రిజర్వాయరు చెంత హిందూ కైలాస భూమికి వెళ్ళే మార్గంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కొత్తపేటలో కొత్త తాగు నీటి బోర్ తవ్వకం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అభ్యర్థిగా శెట్టిబత్తుల కుమార్ రాజా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఎన్టీఆర్ విగ్రహం వీధిలో ఓ భవనంలో పంచాయతీ నిధులతో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ గ్రంధాలయాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఆయా అభివృద్ధి సంక్షేమ పథకాల పనుల శిలా ఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక రాఘవేంద్ర రెసిడెన్సీలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ఘనంగా పౌర సన్మానాన్ని నిర్వహించారు. సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా అధ్యక్షత వహించిన సభలో సన్మాన గ్రహీత సత్యప్రభ అన్నవరం గ్రామ పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. రాజకీయం అన్నది ఎన్నికల వరకే చూసుకోవాలని, ఆ తర్వాత గ్రామ ప్రజలు అందరూ కలిసి కట్టుగా ఐకమత్యంగా కృషి చేస్తేనే అభివృద్ధి పదంలో ముందుకు సాగగలం అని హితవు పలికారు. సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, జనసేన రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, శంఖవరం మండలం పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, పూర్వపు తూర్పు గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్, మండలం తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షుడు బద్ది రామారావు, ఇంకా కొందరు ప్రముఖులు ప్రసంగించారు. పంచాయతీ కార్యాలయం ముఖద్వారం నుంచి కార్యాలయం వరకూ మునుపు ఎన్నడూ లేని రీతిలో ఎమ్మెల్యేకు అపూర్వ ఘనస్వాగతం పలికారు. దారి పొడవునా ఎమ్మెల్యేతోపాటు ఆహుతులు అందరిపై పూల వర్షం కురిపించారు. కార్యక్రమాలు యావత్తూ మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఎమ్మెల్యేకు అపూర్వ ఆదరాభిమానాలు కురిపించారు. పంచాయతీ ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, కార్యదర్శి వాద్రేవు చక్రవర్తి, ఇంకా పలువురు ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు, ఎన్.డి.ఏ. శ్రేణులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్ దొంగల ముఠాకు చెక్

**14.50 లక్షల విలువైన 29 బైకులు స్వాధీనం.. ప్రధాన నిందితులు అరెస్ట్**



**కాకినాడ, క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిల్ దొంగతనాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 29 మోటార్ సైకిల్ దొంగతన కేసులను ఛేదించి, మొత్తం రూ.14,50,000 విలువైన బైకులను స్వాధీనం చేసినట్లు కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ తెలిపారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను ఎస్పీ కాకినాడలోని తన ఛాంబర్ లో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్, టౌన్ పోలీస్ బృందాలు సంయుక్తంగా దర్యాప్తు కొనసాగించాయి.

**అరెస్ట్ వివరాలు...**

కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కేసు దర్యాప్తులో ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మొత్తం 29 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. అరెస్టయిన నిందితులు.... 1. యేగి విజయ్ రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం అతనిపై మొత్తం 19 కేసులు 2. నీలపు హర్ష సాయి వర్ధన్, పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నెగ్గిపూడి అతనిపై మూడు కేసులు 3. చెర్ల జగన్మోహన్ రెడ్డి పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామం అతనిపై 8 కేసులు రిసీవర్లు 4. సలాది బిర్లా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట 5.మేడిద సూర్యప్రకాశరావు కోనసీమ జిల్లా అల్లవరం 6 పెనుగొండకు చెందిన అడబాల శ్రీను, 7. రావులపాలెంలోకి చెందిన సలాది శ్రీనివాస్లను అరెస్టు చేశారు దొంగలించిన వాహనాలను నలుగురు రిసీవర్లు కొనుగోలు చేసినందుకు అరెస్ట్ చేశారు. నిందితులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో పార్క్ చేసిన బైకులను గమనించి, ఎవరూ లేని సమయంలో తాళాలు బ్రేక్ చేసి దొంగిలించేవారు. తరువాత వాటిని తక్కువ ధరలకు రిసీవర్లకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

### ట్రామా' కేర్ కేంద్రాలను

# మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు

**ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** 11, 12వ ఐదేళ్ల ప్రణాళికల్లో భాగంగా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ట్రామా' కేర్ కేంద్రాలను రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించినట్టు కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ వెల్లడించారు. 'ట్రామా' కేర్ కేంద్రాలు నిర్వహణ, భవిష్యత్తు ప్రణాళికలపై శుక్రవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న మరణాలను గణనీయంగా తగ్గించడంతోపాటు, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్రం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో 196 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో గుజరాత్ తర్వాత ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా 14 ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, కాకినాడ జిల్లాలో తుని, కాకినాడలో ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మంత్రి వివరించారు. రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు 'ట్రామా' కేంద్రాలకు పెండింగ్ లో ఉన్న కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు తక్షణం విడుదల చేయడంతో పాటు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, నిపుణులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని మరింత పెంచి అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కేంద్ర మంత్రి తెలిపారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు.

### ప్రత్తిపాడు సిహెచ్‌సి నందు మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో

# న్యాయ అవగాహన సదస్సు




**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు మండల లీగల్ కమిటీ ఆధ్వర్యం లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ కమిటీ సభ్యులు బుగత శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ ( యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే 2025 ) సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల కి అందాల్సిన వైద్యం వారు ఎదుర్కొంటున్న సమస్యల కి లీగల ఫ్రేమ్ లో చట్టపరంగా వారికి అందాల్సిన సౌకర్యాలు హక్కులు వారికి తెలియజేయడం జరుగుతుందని. ప్రతి పదిమంది జనాభాలో నలుగురు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని దానితో పాటు వారు ఆర్థికంగా ఆ సమస్యలను ఎదుర్కొనలేక పోవడం వల్ల ప్రభుత్వ పరమైన వైద్యాన్ని ఉపయోగించుకోవాలని దాని కొరకు హాస్పిటల్ సంబంధించిన వారితో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్న డెలివరీ సమయంలో డబ్బులు కొరకు ఇబ్బందులకు గురిచేసిన. కారుకులైన వారిపై ప్రతి శనివారం మెజిస్ట్రేట్ వారు ఎటువంటి ఫీజు లేకుండా కేసులు పరిష్కరిస్తారని. చట్టాల పట్ల సరైన అవగాహన ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఫ్రీ మందులు ప్రభుత్వం నిర్దేశించిన వాటిని ఉపయోగించుకోవాలని మాట్లాడారు. అనంతరం హాస్పిటల్ సూపర్డెంట్ ఎ సౌమ్య మాట్లాడుతూ ఇంతవరకు ప్రత్తిపాడు కమ్యూనిటీ హాస్పిటల్ పై ఉన్న రూమర్లను మళ్లీ పున:రావృతం కాకుండా బాధ్యత వహించి ప్రతి విషయాన్ని గమనించి ఎ ఒక్కరు ఆర్థికంగా డబ్బులు విషయంలో ఇబ్బందులు పడకుండా వైద్యం అందేటట్లు డెలివరీ సమయంలో కూడా ఎ ఒక్కరూ వల్ల డబ్బులు ప్రస్తావన లేకుండా చూస్తానని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సూపర్డెంట్ ఏ సౌమ్య తో పాటు డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# కార్మిక శాఖ మంత్రికి భవన నిర్మాణ కార్మికుల గోడు వినిపించదా...

**సంక్రాంతి లోపు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునః ప్రారంభించాలి : పుప్పాల సత్యనారాయణ**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కాకినాడలో స్థానిక సాంబమూర్తి నగర్ పి.ఆర్ భవన్‌లో టి.అన్నవరం అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రమాదాలు పై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ది కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనులు చేస్తున్న కార్మికులకు బ్రతుకు భారమైందని, సొంత ఊర్లో పనులు లేక వలసలు వెళ్లే పరిస్థితి దాపరించిందని గత ప్రభుత్వం కన్నా ఈ ప్రభుత్వం మేలని ఆశించిన ఫలితం లేదని ప్రభుత్వాలు మారినా పాలన మారలేదని ఒకే విధంగా ఉందని ఏ ప్రభుత్వం అధికారంలో వచ్చిన భవన నిర్మాణ కార్మికుల నిధులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల గోడు కార్మిక శాఖ మంత్రి కి వినిపించదా అని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 కోట్లు భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైమ్ ఉన్నాయని పెండింగ్ క్లైమ్లు తక్షణమే విడుదల చేయాలని అనేకసార్లు వినతి పత్రం అందజేసిన ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన కురిసినట్లు చందంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఏపీ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రమాదాలపై సదస్సు కాకినాడలో నిర్వహించామని, ఈ సదస్సుకు అమలాపురం, రాజమండ్రి, కాకినాడ జిల్లా కాకినాడ, సామర్లకోట ,పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, వీర్ కమల్,శారదా దేవి గుడి, ఏపీఎస్పీ, తిమ్మాపురం, నడకుదురు, జై రామారావు పేట, తదితర ప్రాంతాల నుండి యూనియన్ ముఖ్య బాధ్యులు హాజరయ్యారని, ఈ సదస్సుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ సంక్రాంతి తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాల అమలుపై భవిష్యత్తు కార్యచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే.సత్తిబాబు, అమలాపురం యూనియన్ అధ్యక్షులు బోనం చిన్న, రాజమండ్రి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, పెద్ది రెడ్డి త్రిమూర్తులు, పి.సత్తిబాబు, కురుసా నాగేశ్వరరావు, సాక రామకృష్ణ, గదుల నూకరాజు, సత్తిబాబు, మంగరాజు,అర్జున్ రావు, మాతా కృష్ణ, నమ్మి బాలకృష్ణ,రామకృష్ణ తదితర కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ముద్దాయి అరెస్ట్....



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సినిమా రోడ్ గల ఎస్సార్కె సెంటరులో ఈనెల9న జరిగిన హత్యకేసులో ముద్దాయిని అరెస్ట్ చేయడం జరిగిందని 3వ పట్టణ సిఐ కెవిఎస్ సత్యనారాయణ తెలిపారు. రోడ్ ప్రక్కన చెప్పులు కుట్టుకునే కీర్తి సత్యనారాయణ(45) కాపు అను ఆసామిని మార్కెట్ ఏరియాకు చెందిన ముద్దాయి అత్తిలి రంగ(42) మద్యం సేవించి వచ్చి చెప్పులు కుట్టే చోట ఉండే పదునైన చాకుతో కీర్తి సత్యనారాయణ ఎడమ చాతిపై బలంగా పొడిచి పరారు అయినట్లు తెలిపారు. మృతుడితో సహజీవనం చేస్తున్న మహిళ జిజిహెచ్ కు తీసుకొని వెళ్ళగా అక్కడ చనిపోయినట్లు పిర్యాది ఇచ్చిన పిర్యాదు ప్రకారం హత్య కేసు నమోదు చేయడమైనదన్నారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, కాకినాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పాటిల్ దేవరాజ్ మనిష్ నేరస్థలంను సందర్శించి దర్యాప్తు అధికారి అయిన కాకినాడ 3 వ పట్టణ లా అండ్ ఆర్డర్ ఇన్స్పెక్టర్ కెవిఎస్ సత్యనారాయణకి పలు సూచనలు చేసి దర్యాప్తు పగడ్బందిగా చేపట్టాలని తెలియచేసి పరారిలో ఉన్న ముద్దాయి అత్తిలి రంగ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగినది. కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్,సిబ్బంది సిబ్బంది ముద్దాయిని అరెస్ట్ చేశామని తెలిపారు. ముద్దాయి తన నేరమును అంగీకరించాడని అన్నారు. మృతుడు కీర్తి సత్యనారాయణ ముద్దాయిని సంఘటనకు ముందు రోజు మద్యం త్రాగి అసభ్యకరంగా తిట్టగా దానిని మనసులో పెట్టుకుని ముద్దాయి మృతుడుని చంపాలనే ఉద్దేశ్యపూర్వకంగా అతనితో ఘర్షణకు దిగి అక్కడే ఉన్న చెప్పులు కుట్టుకునే చాకుతో పొడిచి చంపినట్లు తెలిపారు. సదరు ముద్దాయి వద్ద నుండి నేరంనకు ఉపయోగించిన చాకు మరియు నేర సమయంలో ముద్దాయి ధరించిన బట్టలును స్వాధీనపర్చుకున్నామన్నారు. ఈ సందర్భంగా హత్య కేసును త్వరిత గతిన చేదించి ముద్దాయిని చాకచక్యంగా అరెస్ట్ చేసిన 3 వ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కెవిఎస్.సత్యనారాయణ, 3 వ పట్టణ ఎస్సై ఎమ్. సాగరబాబు,హెచ్సి సతీష్,పిసి జి. శ్రీనివాస్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి : జేసీ అపూర్వ భరత్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 24న జాతీయ వినియోగారుల హక్కుల దినోత్సవం-2025 పురస్కరించుకుని వినియోగదారుల హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లో జేసీ అపూర్వ భరత్.. పౌరసరఫరాలు, విద్య, ఆరోగ్యం, కమర్షియల్ టాక్స్, ట్రాన్స్పోర్ట్, హైయర్ ఎడ్యుకేషన్, ఫుడ్ కంట్రోల్ ఇతర శాఖల అధికారులు, వినియోగదారుల స్వచ్ఛంద సంస్థ సభ్యులతో జిల్లాలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల హక్కులపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 18 నుంచి 24 వరకు వారం రోజుల పాటు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందిలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్, ఇతర శాఖల అధికారులు, వినియోగదారుల హక్కుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16 నుండి ధనుర్మాస మహోత్సవాలు

### నెల గంట ప్రారంభం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సర్పవరం జంక్షన్‌లో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక ధనుర్మాస మహోత్సవాలు ఈనెల 16 నుండి వచ్చే ఏడాది జనవరి 14 వరకు జరుగనున్నాయి. ప్రతిరోజు తెల్లవారుజామున 5:15 నిమిషాలకు స్వామికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, గోదాదేవి అమ్మవారికి అర్చనలు, తిరుప్పావై నిర్వహించనున్నారు. ఈనెల 30న ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, వైకుంఠ ద్వార దర్శనం జరుగునున్నాయి. ఈనెల 17 నుండి విశేష అవతారాలలో స్వామివారిని అలంకరించనున్నారు. జనవరి 14న పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోదా అమ్మవారి కళ్యాణం, ధనుర్మాస మాస ముగింపు జరుగనుంది. యావన్మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు జివివి నరసింహచార్యులు కోరారు.

# పంటల అధిక దిగుబడికి మునారా అమ్మోనియం సల్ఫేట్ గుళికలు అత్యుత్తమం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు తాము పండించే వ్యవసాయ ఉత్పత్తులలో అధిక దిగుబడి సాధించేందుకు మునారా ఆగ్రో టెక్నాలజీస్ రూపొందించిన అమ్మోనియం సల్ఫేట్ రసాయన గుళికలు ఎంతగానో ఉపయోగపడుతుందని మునారా ఆగ్రో టెక్నాలజీస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీఎస్సార్.నాయుడు తెలిపారు. సంస్థ ఉత్పత్తి అమ్మోనియం సల్ఫేట్ గుళికలను వ్యవసాయ సహాయ సంచాలకులు కె.దుర్గాలక్ష్మి తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడి, నాణ్యత, తక్కువ వ్యయంలో తమ ఉత్పత్తులు వెదజల్లేందుకు, కరిగించు కోవడానికి అనుగుణంగా 50కేజీల బస్తా రూ.795/-లకే అందుబాటు ధరలతో లభిస్తాయని అన్నారు. ఆధునిక సాంకేతికతతో తయారైన ఎస్టిక్, బ్లాక్ గోల్డ్ లాంటి ఉత్పత్తులు ఇప్పటికే అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ సత్యనారాయణ,సంస్థ జోనల్ మేనేజర్ జి.గోవిందరావు, హెచ్చార్ హెడ్ చంద్రశేఖర్, లాజిస్టిక్ హెడ్ వివిఎల్. నరసింహా రావు,రీజనల్ మేనేజర్ పి.శివరాం, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



### నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి

# ఇతరులకు అన్యాక్రాంతం చేసిన రెవెన్యూ అధికారులు

**కోట్ల విలువైన దళితుల భూమి అన్యాక్రాంతం - భూమి వద్దకు వస్తే చంపుతామని బెదిరిస్తున్న అక్రమార్కులు**
**తమకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకుంటున్న బాధిత కుటుంబం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన జిరాయతీ 7.78 సెంట్లు భూమి ని అక్రమంగా ఆన్ లైన్ చేసిన రెవెన్యూ అధికారులు మరొకరికి పేరుతో అన్యాక్రాంతం చేశారని తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, వాదాలకుంట గ్రామానికి చెందిన కొడమంచలి సోమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గోపాలపురం మండలం కంచర్ల గూడెం గ్రామం లో తమ పూర్వీకులు నుంచి సంక్రమించిన జిరాయతీ భూమి 7.78 సెంట్లు భూమిని మాకుంటుంబస్తుల తో కలిసి మా తాతగారైన జర్మియ పేరున పట్టాభూమి ఉందని తెలిపారు. 50 సంవత్సరాల నుండి పొలం సేద్యం చేస్తున్నిమని తెలిపారు. సాగు చేసుకొనే పట్టా భూమి నెం.309/3గా ఉండగా భూమి 150/1ఎ1 నందు ఆర్.ఎస్.ఆర్.నందు పేరు కలిగిన ఉప్పలపాటి వెంకన్న తదితరులు యజమానులు ఎవ్వరూ లేని కారణంగా మేము చేసుకొను భూమి విషయములో ఎవ్వరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని వివరించారు. ఇప్పటి వరకు ఆ భూమిని వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. మా కుటుంబస్తుడు అయిన కొడమంచలి విజయ కుమార్ మార్ అతను మా వద్ద ఉన్న పట్టా నాకు ఇవ్వండి ఆన్ లైన్ చేసి ఇస్తాను అని తీసుకొని మాచేత ఖాళీ పేపర్లుపై సంతకాలు తీసుకొని కొంత డబ్బు ఇచ్చి ఖాళీ నోట్లపై సంతకాలు తీసుకొని మాకు ఏదో మేలు చేస్తున్నట్లు మభ్యిపెట్టాడని ఆరోపించారు. మాతో మా కుటుంబీకురాలై కూలిపని చేసుకొని బ్రతికే కొడమంచలి మరియమ్మ అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా వెబ్సైట్లో అప్పటి డి.టి కృష్ణ సహకారంతో అధికమొత్తంలో లంచం ఇచ్చి కరణం ఉదయ్ సూచనల మేరకు వెబ్ సైట్లోన ఎటువంటి మ్యూటేషన్ లేకుండా మ్యుటేషన్ సంబంధించిన దస్త్రాలు చూడకుండా కొడమంచిలి మరియమ్మకు 150/1ఎ1లో జిరాయితీ భూమి య7.83 సెంట్లు ఉన్నట్లు తప్పుడు ఆన్ లైన్ చేశారని వివరించారు. ఈ సర్వే నెంబరులో గల జిరాయితీ భూమిని కొడమంచలి మరియమ్మ పేరుమీద ఎలా ఆన్లైన్ చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై డి.టి కృష్ణను అడుగగా చంపుతామని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. డి.టి కృష్ణ, కరణం ఉదయ్, ఆన్లైన్ అయిన కొద్ది రోజులకు రిజిస్ట్రేషన్ లింకు డాక్యుమెంట్ అవసరం కోసం మరియమ్మ పేరున ఆన్ లైన్ అయిన య7.83 సెంట్లు భూమిని కొనుగోలు అని గాని, స్వార్జితం అని గాని, పూర్వార్జితం అస్తి అని కాని రిజిస్ట్రేషన్ దస్త్రాలలో నమోదు కాలేదని అన్నారు. రిజిస్ట్రేషన్ నిబంధనలు విరుద్ధంగా ఎటువంటి డ్యాక్యుమెంట్లు చూడకుండా కేవలం అక్రమంగా నమోదు చేసి ఆన్ లైన్ ఆధారంతో మాత్రమే తన సొంత కుమారుడైన కొడమంచలి విజయ్ కుమార్ పేరున య7.83 సెంట్లు భూమి ని కరణం ఉదయ్ రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు. మరికొంత కాలానికి మట్టపర్తి సత్యనారాయణకు య3.00సెంట్లు భూమిని,సాకా సప్తగిరి కి య3.00సెంట్లు రిజిస్ట్రేషన్ చేసి విజయ్ కుమార్ కు మిగిలిన భూమితో సహా మొత్తాన్ని రెడ్డి సంజీవరావు కు రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం వీటన్నిటికీ పూర్తి స్థాయిలో రెవెన్యూ నిబంధనలను అతిక్రమించి డి.టి.కృష్ణ, కరణం ఉదయ్, కొడమంచలి విజయకుమార్, సప్తగిరి సత్యనారాయణ లు రూ.2.30కోట్లకు ఏ ఆధారాలు, ఏ హక్కులు లేకుండా కేవలం అక్రమ మ్యూటేషన్ చేసిన 1బి ఆధారంతో రిజిస్ట్రేషన్ జరిపి సుమారు రూ.2.3కోట్లకు ల్యాండ్ మాఫియాకు పాల్పడ్డారని ఆరోపించారు. సర్వే నెం. 150/1ఎ1లో మేము సాగుచేసుకుంటున్న భూమిని అన్యక్రాంతం చేసి చివరకు మాకు 150/1ఎ1లో గాని 309/3లో గాని మాకు భూమి లేకుండా చేసి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల తరువాత తాము సేద్యం చేసుకునే భూమిని ఖాళీ చేయాలని విజయ్కుమార్, డి.టి. కృష్ణ, కరణం ఉదయ్ లు తలపై దౌర్జన్యం చేశారని వివరించారు. తమ భూమి తాలూకా పట్టా తీసుకువెళ్ళి తమకు చెప్పకుండా తమను భూమి ఖాళీ చేయమని అడగటం ఏంటి అని ప్రశ్నించామని అన్నారు. ఈ భూములు కొన్నవాళ్ళు చాలా పెద్దవాళ్ళు, మీకు చాలా ఇబ్బంది వస్తుంది అని బెదిరించి, ఖాళీ చేయకపోతే అవసరమైతే మిమ్ములను లేకుండా చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము సేద్యం చేస్తున్న భూమి అన్యాక్రాంతం అవ్వడానికి ఇదే భూమిని అని దాని మీదే ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. తమ భూమిని తప్పుడు ఆన్ లైన్ చేసి నకిలీ డాక్యుమెంట్లు పుట్టించిన, డి.టి. కృష్ణ, కరణం ఉదయ్ , కొడమంచలి విజయ్ కుమార్, సప్తగిరి సత్యనారాయణ వల్ల తమ మా కుటుంబానికి ప్రాణ హాని ఉందని అన్నారు. తమకు రక్షణ కల్పించి భూమిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



# ఘనంగా 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

**దివ్యాంగులకు భవనం నిర్మించాలి..జిల్లా కార్యాలయాలు ఇక్కడికే తరలించాలి - సమస్యలు చెప్పుకునేందుకు ఏడీని అందుబాటులోకి ఉంచాలి**
**కూటమి ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులకు 7 వరాలు ప్రకటన హర్షణీయం.. - చంద్రబాబు,పవన్,లోకేష్, మంత్రి స్వామి చిత్రపటాలకు పాలాభిషేకం**








**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక ఆల్కాట్ తోట గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడు వరాలు ప్రకటించిన సందర్భంగా పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఎవై శ్రీనివాస్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో ఆయనతో పాటు జిల్లాలోని పలు దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం 7వరాలు ప్రకటించిన సందర్భంగా సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, డిబివి స్వామి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. దివ్యాంగులకు ఒక భవనం నిర్మించాలని, జిల్లా కార్యాలయాలు ఇక్కడికే తరలించాలని, సమస్యలు చెప్పుకునేందుకు ఏడీని అందుబాటులో ఉంచామని పలు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేసారు. దివ్యాంగుల సమస్యలను కలెక్టర్, ఇతర ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని కోరతామని ఏ.డీ శ్రీనివాస్ తెలిపారు. వికలాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్,పలుకు సత్యనారాయణ, కె. భరత్ కుమార్, పలివెల రాజు, ఎస్పి రెడ్డి, విశాలాక్షి, రాజు, కంచిపాటి గోవిందు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సామాజిక సేవకులు స్వర్ణాంధ్ర వ్యవస్థాపకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు వారికి భోజన సదుపాయం కల్పించారు.

# రాజమండ్రిలో పలుచోట్ల కోటి సంతకాల సేకరణ..

**అనూహ్య ప్రజాస్పందన..వెల్లువెత్తిన సంతకాల జోరు - స్వచ్ఛందంగా విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు హాజరు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో అందరూ జగనన్న తరపున నిలబడతారు. రాజమండ్రి సిటీ, వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. భరత్ రామ్ ఆదేశాలు ప్రకారం సిటీ లో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ గోకవరం బస్ స్టాండ్ వద్ద సిటీ యువజన విభాగం అధ్యక్షులు బిల్డర్ చిన్న, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సప్ప ఆదినారాయణ, సిటీ పార్టీ అధికార ప్రతినిధి రోక్కం త్రినాథ్, పార్టీ నాయకులు కటకం చిన్న, కృష్ణ కుమారి ఆధ్వర్యంలో, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదిత్య కాలేజీ వద్ద, సిటీ బీసీ సెల్ ప్రెసిడెంట్ పీత రామకృష్ణ మిత్ర బృందం ఆధ్వర్యంలో, మోరంపూడి జంక్షన్ వద్ద రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అరె చిన్ని మిత్ర బృందం ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు దూలం ప్రసాద్ అలియాస్ శాండీ మిత్ర బృందం ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ప్రభుత్వ నిరంకుశత్వ తీరు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో యువత, వ్యాపారస్తులు, సాధారణ ప్రజానీకం, అందరూ స్వచ్ఛందంగా వచ్చి కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు జగనన్న కు అని చెప్పడం జరిగింది. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేసి తమ వాళ్లకు కట్టబెట్టి కోట్ల రూపాయలు ప్రజాధనం అలాగే ప్రజల ఆరోగ్యం యువత విద్య నాశనం చేసే ఉద్దేశ్యం తో కూటమి ప్రభుత్వం ఈ దుశ్చర్యకు పూనుకుందని ప్రజలకు అర్థం కావడం ఈ సంతకాల వెల్లువకు నిదర్శనం అని భరత్ తన ప్రకటనలో తెలిపారు. విద్య వైద్యం కోసం జగనన్న ఎంత ప్రాముఖ్యత ఇచ్చిందో అలాగే వాటిని కాపాడటం కోసం జగనన్న పార్టీ అలాగే పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉందని ఈ విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని భరత్ తెలిపారు. రాబోయే కాలం లో ప్రజల శ్రేయస్సు, ఆరోగ్యం, యువత చదువు ఇబ్బంది కలిగేలా ఈ కూటమి ప్రభుత్వం తలపెడితే చూస్తూ ఊరుకోమని ఈ సంతకాల ద్వారా ప్రజానీకం కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసింది అని, ఇక పైన ఇలాంటి నీచ కార్యక్రమాలకు పాల్పడితే ప్రజలు తగిన శాస్తి చేసి తీరతారని పలువురు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిటీ పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేసినందుకు సిటీ యావత్తు ప్రజలకు భరత్ తన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రాజధాన్ని బూచిగా చూపిస్తూ కూటమి రైతులను దోచుకుంటుంది

**అమరావతి నిర్మాణం జరపరు - పోలవరం ప్రాజెక్టను సాధించరు... - మేడా శ్రీనివాస్ ఆవేదన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాన్ని బూచిగా చూపిస్తు రైతులను దోచుకుంటున్నారు. రాజధాని అభివృద్ధికి వేల యకరాలు రైతుల నుండి తీసుకోవటం అవసరమా! నిజంగా రాజధాని పూర్తి అయితే రైతు వద్ద అర ఎకరం కూడా భూమి ఉండదు. భూ సేకరణ పేరుతో రైతుల శ్రమను, భూములను కార్పొరేట్ సంస్థలకు, పాలకుల బినామీలకు దారాదత్తం. రెండవ విడత భూ సేకరణ పూర్తిగా అధర్మం. మొదటి విడత జరిపిన భూ సేకరణ లోనే నేటికి రైతుకు న్యాయం జరగలేదు. రాజధానిగా అమరావతి శాస్త్రీయపరంగా తప్పుడు నిర్ణయం. గుంటూరు, విజయవాడ, రాజమండ్రి లో ఎక్కడ నిర్మించినా డబ్బు వృధా కాకపోను. అప్పులు బారం ప్రజలపై పడకపోను. రెండొవ విడత భూ సేకరణ తక్షణమే నిలిపివేసి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై దృష్టి కేంద్రికరించండి అని ఒక ప్రకటనలో మేడా శ్రీనివాస్ అన్నారు.

### జిల్లాలో రైస్ మిల్లర్లకు

# షోకాజ్ నోటీసులు

**- జేసీ మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనధికార వసూళ్లు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై జిల్లా అధికారులు కఠినంగా స్పందించారు. మురమండ రైతు సేవా కేంద్రానికి చెందిన రైతులు ఐ వి ఆర్ ఎస్ సర్వేలో ఇచ్చిన వివరాల ప్రకారం, ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రతి బస్తా పై కోత విధించడం, రైతుల నుండి అనధికార వసూళ్లు చేయడం వంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించబడింది. రైతులను నేరుగా ఆర్థికంగా నష్టపరిచే ఈ చర్యలు ధాన్యం కొనుగోలు విధానాలపై తీవ్రమైన ఉల్లంఘనలుగా పరిగణించబడతాయని జాయింట్ కలెక్టర్ మరియు ఇ.ఒ.ఇ.డి జేసీ మేఘా స్వరూప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ దర్యాప్తులో అనపర్తి, బిక్కవోలు, చాగళ్ళు, కడియం, కోరుకొండ మండలాలకు చెందిన మొత్తం తొమ్మిది (9) రైస్ మిల్లులు అనధికార వసూళ్ల ఆరోపణల్లో నిశితంగా ప్రస్తావించబడ్డాయి. వారాహి రైస్ ఇండస్ట్రీస్ (రామవరం), అయ్యప్ప ఆర్ అండ్ బి ఆర్ ఎం (పోలమూరు), సాయి తేజ ఆగ్రో ఇండస్ట్రీస్ (తోసిపూడి), వైష్ణవి రైస్ ఇండస్ట్రీస్ (అనపర్తి), కొదండరామ బి అండ్ ఆర్ ఆర్ ఇఎం (పందలపాక), వెంకట సూర్య ట్రేడర్స్ (బ్రాహ్మణగూడెం), సూర్యదత్త ట్రేడర్స్ (బ్రాహ్మణగూడెం), వెంకట సూర్య సుబ్బరాయ బిఅండ్ఆర్ ఆర్ఎంబి (కడియం), విశ్వేశ్వర బియ్యం వ్యాపారులు (వెస్ట్ గోనగూడెం) మిల్లులు ఫిర్యాదుల్లో ప్రస్తావించబడ్డాయి. ఈ మిల్లులపై ధాన్యం/రైస్ అలాట్మెంట్ నిలిపివేత, మిల్లులను బ్లాక్లిస్ట్ చేయడం వంటి కఠిన చర్యలు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైస్ మిల్లర్లు మూడు (3) రోజుల్లో తమ వ్రాతపూర్వక వివరణను జాయింట్ కలెక్టర్ అండ్ ఇ.ఒ.ఇ.డి కార్యాలయానికి సమర్పించాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రైతులకు అన్యాయం జరిగితే కఠిన చర్యలు తప్పవని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అనధికార వసూళ్లు జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని జేసీ మేఘా స్వరూప్ సూచించారు.

### రాజవరంలో 32లక్షలతో

# పంచాయితీ భవనం నిర్మాణం : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని రాజవరం గ్రామంలో సుమారు 32లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరణం రమణ, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, ముక్క దేవిదుర్గా రాంబాబు, తనకాల నాగేశ్వరరావు, గంగిశెట్టి చంటిబాబు, అడపా వీరబాబు, రొంగల శ్రీనివాస్, కొయ్య సామ్యూల్, పుప్పాల వెంకట రత్నం, అడపా శ్రీనివాస్, ఎర్రంశెట్టి పోలారావు, సెక్రటరీ కర్రి కుమారి, పలువురు ఎన్డిఏ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం కనుపూరు గ్రామానికి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు ఎన్డీఏ ప్రభుత్వానికి,పలువురు ఎన్డీఏ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కనుపూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న సింహాద్రి వెంకటేశ్వరరావుకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా సుమారు 25 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్డీఏ ప్రభుత్వానికి, ఎన్డీఏ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, ముక్క రాంబాబు, అన్నం చల్లారావు, ఎర్రంశెట్టి పోలా రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తమైన అంగన్‌వాడీ ఆందోళన

**ధర్నాకు మైక్ కట్ చేయడంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు**
**సబ్ కలెక్టరేట్ గేట్ లోపలికి వెళ్లేందుకు యత్నించిన అంగన్‌వాడీలు - పోలీస్‌లతో తోపులాట**
**అంగన్‌వాడీల వేతనాలు పెంచాల్సిందే.. సిఐటియు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరావు, అంగన్వాడీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంభ, బేబీ రాణి మాట్లాడుతూ గత ఆరేళ్ళ నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని, తక్షణం ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26వేలు అంగన్వాడీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు.యాప్ల పేరుతో పని భారాన్ని తగ్గించాలని అన్ని యాప్లు కలిపి ఒకే యాప్ గా మార్చాలని, అంగన్వాడీ సెంటర్లను పాఠశాలల్లో విలీనాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అంగన్వాడీ బడి పిల్లలకు స్నాక్స్ ఇవ్వడం మానేశారని, తక్షణం పునరుద్ధరించి పిల్లలకు మెరుగైన పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు అంగన్వాడి బడ్జెట్ను పెంచాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ లు అనేక హామీలు, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం తప్పితే, అధికారంలోకివచ్చి 15 నెలలు గడుస్తున్నా అంగన్వాడీల సమస్యలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. 42 రోజుల సమ్మె ఏకబిగిన చేసిన అనుభవం అంగన్వాడీలకు ఉందని గుర్తుచేశారు. దశల వారి పోరాటాలకు అంగన్వాడీ ఆయాలు, టీచర్లు, మినీలు, సిద్ధపడి వేతనాలు పెంచుకునేందుకు పోరుబాటకు సిద్ధపడలాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, సిఐటియుజిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, టి.తులసి, రామచంద్రరావు, పూర్ణిమరాజు అంగన్వాడిలను ఉద్దేశించి మాట్లాడారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు అన్నపూర్ణ, మార్త, రామలక్ష్మి, కృష్ణవేణి, సుజాత,తదితరులు పాల్గొన్నారు.

# నేడే జాతీయ లోక్ అదాలత్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లాలో 46 బెంచిలు ఏర్పాటు : జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 13న 4 వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్‌బౌన్స్, యాక్సిడెంట్, బ్యాంకుల కేసులు, ప్రీ-లిటిగేషన్ తదితర కేసులను పరిష్కరించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 46 బెంచిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గౌరవ హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు ట్రాఫిక్ చలానా కేసులను కూడా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించిన డ్యూటీ పేయిడ్, నాన్-డ్యూటీ పేయిడ్ కేసులు కూడా రాజీ ద్వారా ముగించుకోవచ్చని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ కోసం మొత్తం 18,035 కేసులను రాజీ పరిష్కారానికి గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ ద్వారా తమ కేసులను వేగంగా పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా కాలభైరవ సర్పయాగ పూజలు

**రాజమహేంద్రవరంలో కాలభైరవ సంస్థాన పీఠం జయంతి వేడుకలు**
**పోటేత్తిన భక్త జనం.. 8వేలమంది భక్తులకు దర్శనం భాగ్యం..**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గోదావరి గట్టున వేంచేసియున్న కాలభైరవ సంస్థాన పీఠంలో కాలభైరవ జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు మహి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కాలభైరవ సంస్థాన పీఠం రాజమహేంద్రవరంలో ఉందని తెలిపారు. ఇక్కడ పైన స్వర్ణ భైరవుడు,క్రింద కాలభైరవ దేవాలయం ఉందని వివరించారు. 9 అడుగుల శివలింగం ప్రత్యేకతగా నిలుస్తుంది అన్నారు.భక్తులు ఎవరికి వారే సర్పహారతి సేవ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. గురువు ఇక్కడ భక్తులకు నాణేలు ప్రసాదంగా ఇస్తారని తెలిపారు. ప్రతి అష్టమి పౌర్ణమి అమావాస్య రోజులలో యాగాలు జరుగుతాయని అన్నారు. నర దిష్టి, శత్రు దోషాలు, నరఘోష,రాహు, కేతువుల దోషాలు ఈ దేవాలయంలో పూజలు చేయడం ద్వారా నివారించవచ్చునని వివరించారు. కాలభైరవుని దర్శించుకునేందుకు బెంగుళూరు, చెన్నై , తెలంగాణ, గుంటూరు, సత్తెనపల్లి తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారని అన్నారు. ప్రతి అమావాస్య రోజున 1000 మంది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు.

# రజనీకాంత్ 75వ పుట్టిన రోజు..

## చంద్రబాబు, మోదీ స్పెషల్ విష్, ఏమన్నారంటే..!



నేడు (డిసెంబర్ 12) సూపర్ స్టార్ రజనీకాంత్ 75వ బర్త్ డే. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సినీ, రాజకీయ నాయకులు బెస్ట్ విషెస్ చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నోతరాల ప్రేక్షకులను అలరిస్తూ తనదైన స్టైల్‌తో ఎన్నో ప్రశంసలు అందుకున్నారు రజనీకాంత్. విభిన్నమైన పాత్రలు పోషిస్తూ ఇండస్ట్రీలో శాశ్వత స్థానాన్ని సొంతం చేసుకున్న రజినీ.. 75వ పుట్టినరోజు చేసుకుంటోన్న సంవత్సరంలోనే ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తికావడం నిజంగా ఎంతో ప్రత్యేకం. ఆయన ఇలానే ఆరోగ్యంగా ఉంటూ ప్రేక్షకులను అలరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నా అని పేర్కొన్నారు ప్రధాని మోదీ. చంద్రబాబు నాయుడు ట్వీట్ చేస్తూ.. "నా ప్రియ మిత్రుడు, మహానటుడు, సూపర్ స్టార్ రజనీకాంత్ గారికి జన్మదిన శుభాకాంక్షలు. తెరపైనే కాదు తెర వెనుక కూడా మీరు రియల్ హీరో. మీ అసాధారణ సినీ ప్రయాణం ఎంత అద్భుతమో, వ్యక్తిగత ప్రయాణం అంతే ప్రేరణాత్మకం. మీకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, ఆనందం కలిగిన జీవితం ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.సూపర్ స్టార్ రజనీకాంత్ కెరీర్ గురించి అందరికీ తెలుసు. బస్ కండక్టర్‌గా మొదలైన ఈ లెజెండరీ యాక్టర్ జర్నీ, ఇండియన్ సినిమాను శాసించే స్థాయికి చేరింది. ఇది ఇప్పటి తరానికి ఇన్స్పిరేషనల్ జర్నీ కూడా. రజినీకాంత్ మిగతా హీరోల్లా స్మార్ట్ గా ఉండడు. కండలు తిరిగిన సిక్స్ ప్యాక్ అసలే లేదు. లేటెస్ట్ ట్రేండ్ అసలే ఫాలో కాడు. అందరు తనని ఫాలో అయ్యేట్టు చేస్తాడు.అంతేకాదు సినీ వినీలాకాశంలో స్వయంకృషితో ఎదిగిన నల్లని చంద్రుడు. అదరగొట్టే స్టైయిల్.. దిమ్మతిరిగే మ్యానరిజంతో బాక్సాఫీస్‌ను సింగిల్ హ్యాండ్‌తో శాసించగల వన్ అండ్ ఓన్లీ హీరో రజినీకాంత్.

# నేవీ ఆఫీసర్ కూతురు, సీరియల్స్‌తో క్రేజ్..

## స్టార్ హీరోతో సూపర్ హిట్.. కట్ చూస్తే, ఇప్పుడు ఆమె లైఫ్ మరీ ఘోరం



సినీ ఇండస్ట్రీ రంగుల ప్రపంచం. ఇక్కడ ఎప్పుడు ఎవరి జాతకం ఎలా మారుతుందో చెప్పలేం. ఒక్క హిట్ పడితే ఓవర్ నైట్ స్టార్ అయిపోతారు. అలాంటి ఓ బంపర్ ఆఫర్ అందుకున్న హీరోయిన్ గురించే ఇప్పుడు మనం చెప్పుకోబోతున్నాం. సినీ ఇండస్ట్రీ రంగుల ప్రపంచం. ఇక్కడ ఎప్పుడు ఎవరి జాతకం ఎలా మారుతుందో చెప్పలేం. ఒక్క హిట్ పడితే ఓవర్ నైట్ స్టార్ అయిపోతారు. అలాంటి ఓ బంపర్ ఆఫర్ అందుకున్న హీరోయిన్ గురించే ఇప్పుడు మనం చెప్పుకోబోతున్నాం. ఈ భామ షాహిద్ కపూర్ సినిమాతో ఫుల్ ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత ఇతర స్టార్ హీరోలతో కూడా ఆడిపాడింది. కానీ ఏం లాభం.. ఇప్పుడు మాత్రం సరైన అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. అలా కెరీర్ పరంగా స్ట్రగుల్ అవుతున్న ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు.. నికితా దత్తా. నేవీ ఆఫీసర్ కూతురు.. నికితా దత్తాది ఢిల్లీలోని పంజాబీ కుటుంబం. తండ్రి నేవీలో రియర్ అడ్మిరల్ కావడంతో ఆమె పెంపకం అంతా చాలా డిసిప్లిన్డ్‌గా సాగింది. వైజాగ్, ముంబై నగరాల్లో పెరిగిన నికితా.. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్ వైపు అడుగులేసింది. 2012లో ఫెమినా మిస్ ఇండియా ఫైనలిస్ట్‌గా నిలిచింది. 2014లో సినిమాల్లో చిన్న రోల్ చేసినా, ఆమెకు మంచి క్రేజ్ తెచ్చింది మాత్రం టీవీ సీరియల్సే. 'ఏక్ దూజే కే వాస్తే', 'హాసిల్' వంటి సీరియల్స్‌తో బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. 'కబీర్ సింగ్'తో లైఫ్ టర్న్.. నిజానికి నికితా కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమా 'కబీర్ సింగ్'. 2019లో వచ్చిన ఈ సెన్సేషనల్ హిట్‌లో షాహిద్ కపూర్‌తో కలిసి నటించడం ఆమెకు బాగా కలిసొచ్చింది. అప్పటి వరకు ఉన్న 'టీవీ నటి' అనే ముద్రను చెరిపేసుకుని బాలీవుడ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా సక్సెస్ ఆమెకు బాలీవుడ్ తలుపులు బార్లా తెరిచింది. ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు కూడా లభించింది. సైఫ్ అలీ ఖాన్, అభిషేక్‌తో సినిమాలు.. కబీర్ సింగ్ తర్వాత నికితా వెనక్కి తిరిగి చూసుకోలేదు.

# మెస్సీ హైదరాబాద్ రాక రేపే..

## పూర్తి షెడ్యూల్ ఇదే.. రేవంత్ రెడ్డితో మ్యాచ్ ఎప్పుడంటే?



అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారతదేశానికి రానున్నారు. 'GOAT టూర్' పేరుతో జరగనున్న ఈ పర్యటనలో ఆయన మూడు రోజుల పాటు నాలుగు ప్రధాన నగరాల్లో సందడి చేయనున్నారు. 2025 డిసెంబర్ 13, 14, 15 తేదీలలో కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, న్యూఢిల్లీ నగరాలను మెస్సీ సందర్శించనున్నారు. 2011 తర్వాత మెస్సీ భారత్‌కు రావడం ఇదే తొలిసారి.

**ఈ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్**

డిసెంబర్ 13: కోల్‌కతా (పర్యటన ప్రారంభం), సమయం: తెల్లవారుజామున 1:30 గంటలకు మెస్సీ కోల్‌కతా చేరుకుంటారు. ఉదయం 9:30 - 10:30: అభిమానులతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం. ఉదయం 10:30 - 11:15: మెస్సీ విగ్రహం వర్చువల్‌గా ఆవిష్కరణ. మధ్యాహ్నం 12:00: సాల్ట్ లేక్ స్టేడియం (యువ భారతి క్రీడాంగణం)లో ఫ్రెండ్లీ మ్యాచ్ మరియు సన్మాన కార్యక్రమం. బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, సౌరవ్ గంగూలీ ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది. మధ్యాహ్నం 2:00: హైదరాబాద్‌కు బయలుదేరుతారు. డిసెంబర్ 13: హైదరాబాద్ సాయంత్రం 7:00: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో 7v7 ఎగ్జిబిషన్ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో మెస్సీతో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారని సమాచారం. ఈ మ్యాచ్‌తో పాటు సంగీత కచేరీ కూడా ఏర్పాటు చేశారు. డిసెంబర్ 14: ముంబై మధ్యాహ్నం 3:30: క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (CCI)లో ప్యాడెల్ కప్‌లో పాల్గొంటారు. సాయంత్రం 4:00: సెలబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్. సాయంత్రం 5:00: వాంఖడే స్టేడియంలో ప్రధాన ఈవెంట్ మరియు చారిటీ ఫ్యాషన్ షో జరుగుతుంది. సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని వంటి దిగ్గజాలు ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. డిసెంబర్ 15: న్యూఢిల్లీ (ముగింపు) ఉదయం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మెస్సీ సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 1:30: అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం. మినర్వా అకాడమీ క్రీడాకారులను సన్మానిస్తారు.

ఈ కార్యక్రమంతో మెస్సీ భారత పర్యటన ముగుస్తుంది. టికెట్ వివరాలు: ఈ ఈవెంట్ టికెట్లు 'District' యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

# ఆ బౌలింగ్ ఏంది సామీ!

## వెళ్లి వైడ్స్ మీద రీల్స్ చేసుకో.. ఈ మధ్య ఎక్స్‌ట్రాలు ఎక్కువయ్యాయి!



ఇదెక్కడి దిక్కుమాలిన బౌలింగ్ రా బాబూ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. నీకెందుకు బౌలింగ్ వెళ్లి వైడ్స్ మీద రీల్స్ చేసుకోపో అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రెండో టి20లో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఎవరూ ఊహించని విధంగా ఆడింది. తొలి టి20లో ఓడిన సౌతాఫ్రికా రెండో టి20లో రెచ్చిపోయింది. 51 పరుగుల తేడాతో నెగ్గి సిరీస్‌ను సమం చేసింది. ఇక భారత విషయానికి వస్తే రెండో టి20లో పసికూన జట్టు మాదిరి ఆడింది. ముఖ్యంగా బౌలింగ్‌లో తేలిపోయింది. ఒక బౌలర్ అయితే ఏకంగా వైడ్ల మీద వైడ్లు వేశాడు. ఏకంగా 9 వైడ్లు వేశాడు. దాంతో అతడిపై భారత అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదెక్కడి దిక్కుమాలిన బౌలింగ్ రా బాబూ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. నీకెందుకు బౌలింగ్ వెళ్లి వైడ్స్ మీద రీల్స్ చేసుకోపో అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రెండో టి20లో భారత స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ చెత్త ప్రదర్శన చేశాడు. ఏకంగా 9 వైడ్స్ వేశాడు. 4 ఓవర్లలో 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఓవర్‌కు 13.50 చొప్పున పరుగులు ఇచ్చుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఈ మధ్య కాలంలో మనోడు రీల్స్ ఎక్కువగా చేస్తున్నాడు. మూడో వన్డే పూర్తయిన అనంతరం విరాట్ కోహ్లీతో కలిసి రీల్స్ చేశాడు. ఆ సమయంలో రన్స్ మరిన్ని ఉండి ఉంటే నువ్వు సెంచరీ చేసేవాడివి అంటూ కోహ్లీని అంటాడు. దానికి కోహ్లీ.. నువ్వు రెండోసారి బౌలింగ్ చేసి ఉంటే.. నువ్వు కూడా సెంచరీ చేసేవాడికి అంటూ సెటైర్ వేస్తాడు. కట్ చేస్తే.. రెండో టి20లో అది నిజమైంది. అర్ష్‌దీప్ సింగ్ తన పేలవ బౌలింగ్‌తో అర్ధ సెంచరీ బాదాడు. పరుగులు ఇచ్చుకోవడం సహజమే.. అయితే క్రమశిక్షణ లేని బౌలింగ్‌ను ఎవరూ కూడా ఎంకరేజ్ చేయరు. ఏకంగా 9 వైడ్లు వేశాడు. అంటే అదనంగా 9 బంతులు వేసినట్లే లెక్క. అర్ష్‌దీప్ దగ్గర మరో అవలక్షణం ఉంది. అదేంటంటే సీరియస్‌గా దేన్నీ తీసుకోడు. ఫీల్డ్‌లో కూడా మనోడు చాలా నెమ్మదిగా కదులుతుంటాడు. చూస్తుంటే మనోడు మూడో టి20లో ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడేది అనుమానంగానే ఉంది. అతడికి బదులుగా హర్షిత్ రాణాను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక మూడో టి20 కోసం భారత జట్టులో చాలా మార్పులే ఉండే ఛాన్స్ ఉంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (90) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు తీశాడు. అనంతరం భారత జట్టు 19.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ (62బీ 2 ఫోర్లు, 5 సిక్సర్లు) మినహా మిగిలిన బ్యాటర్లు విఫలం అయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో బార్ట్‌మన్ 4 వికెట్లతో మెరిశాడు. ఎంగిడి, యాన్సెన్, సిపమ్లాలకు తలా రెండో వికెట్లు లభించాయి.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com